అస్మద్గురుభ్యో నమః

# తిరుప్పావు సారము

(గోదా అష్టోత్తర, శ్రీకృష్ణ అష్టోత్తర నామములు,
గోదా కళ్యాణముతో సహా)



డా॥ కందాడై రామానుజాచార్య M.A., Ph.D.

అస్మద్గురు భ్యో నమః

# తిరుప్పావై సారము



వేదవిభూషణ, ప్రవచన వారిధి

డా॥ కందాడై రామానుజాచార్య M.A.,Ph.D.

ప్రథమ ముద్రణ - 1999
ద్వితీయ ముద్రణ - 2004
ప్రతులు : 2000
తృతీయ ముద్రణ - 2013
ప్రతులు : 1000

డా॥ కందాడై రామానుజాచార్య

మూల్యము : రూ. 60-00

ప్రాప్తిస్థానము :

**వనమాలి పబ్లికేషన్స్**
ప్లాట్ నెం. 16, న్యూ నాగోల్ కాలనీ,
హైదరాబాద్ - 500 035.
ఫోన్ : 24032123, 98493 95111

మరియు

**గోపాల్ పబ్లికేషన్స్**
ఆర్యసమాజ్ మందిర్ ఎదురు సందులో
కాచిగూడ చౌరస్తా, హైదరాబాద్ - 500 027.
ఫోన్ : 24658101

SRIMANNARAYANA RAMANUJA YATHIBHYONAMAHA

*Tridandi Chinna Srimannarayana*
*Ramanuja Jeear Swami*

JEEAR EDUCATIONAL TRUST,
SITHANAGARAM - 522 501.
GUNTUR DISTRICT
PHONE 426929

Dt
18-11-99

[illegible]

అస్మద్గురుభ్యోనమః

# ప్రార్థన

నీలా తుంగస్తన గిరితటీ సుప్త ముద్బోధ్య కృష్ణం
పారార్థ్యం స్వం శ్రుతి శతశిరస్సిద్ధ మధ్యాపయన్తీ
స్వోచ్ఛిష్టాయాం స్రజి నిగళితం యా బలాత్కృత్య భుంక్తే
గోదా తస్యై నమ ఇద మిదం భూయ ఏవాస్తు భూయః

అన్నవయల్ పుదువై యాండా ళరంగఱ్కు
ప్పన్ను తిరుప్పావైప్పల్ పదియమ్-ఇన్నిశైయాల్
పాడి క్కొడుత్తాళ్ నఱ్పామాలై, పుమాలై
శూడికొడుత్తాళై చ్చొల్.

శూడి క్కొడుత్త శుడర్ క్కొడియే! తొల్ పావై
పాడి యరుళవల్ల పల్ వళైయాయ్! - నాడినీ
వేంగడ వఱ్కెన్నై విది యెన్ఱ విమ్మాత్తమ్
నాంగడవా వణ్ణమే నల్గు

అస్మద్గురుభ్యోనమః

# తిరుప్పావు సారము

సంసార దుఃఖముల ననుభవించుచున్న జీవులపై దయతో శ్రీమన్నారాయణుడు అమ్మవారికి (లక్ష్మి) జీవులు ముక్తిని పొందు సులభోపాయములను మూడింటిని ఉపదేశించెను. 1. శ్రీహరి నామ సంకీర్తనము, 2. శరణాగతి, 3. పుష్పార్చన.

ఈ మార్గములను బోధించి జీవులను తరింపచేయ దలచిన అమ్మవారు శ్రీవిష్ణు చిత్తులకు తులసీ వనమున లభించినది. శ్రీ విష్ణుచిత్తులు ఈమెకు 'గోదా' అని నామకరణము చేసిరి.

యుక్తవయస్సు రాగానే గోదాదేవి శ్రీవటపత్ర శాయిని భర్తగా పొందదలచి, అట్లు పొందుటకు పూర్వము గోపికలు వ్రతము నాచరించిరని విని తానా వ్రతమును అనుకరించి ఒక వ్రతము చేయదలచినది. ఆ వ్రతమునే

30 పాశురముల రూపములో రచించెను. దాని పేరే 'తిరుప్పావై'.

ఈ తిరుప్పావు మూడు భాగములుగా పేర్కొనెదరు. మొదటి 5 పాశురములు ఉపోద్ఘాతము. తరువాతి పది పాశురములు పదిమంది గోపికలను మేల్కొలిపి శ్రీకృష్ణుని వద్దకు గొనిపోవుట. తరువాతి పాశురములలో నందగోపుని భవనపాలకుని, ద్వారపాలకుని, మేల్కొలిపి లోనికి వెళ్ళి నందుని, యశోదను, శ్రీకృష్ణభగవానుని బలరాముని మేల్కొలుపుట, తరువాత నీలాదేవిని మేల్కొలుపుట, తరువాత శ్రీకృష్ణుని, నీలాదేవిని, ఇరువురిని మేల్కొలుపుట, శ్రీకృష్ణభగవానుని సభాస్థలిలో వేంచేసి సింహాసనాసీనుని కమ్మని ప్రార్థించుట, స్వామి వేంచేయగానే మంగళా శాసనము చేయుట, తరువాత తాము వచ్చిన పనిని నివేదించి, తమకు సర్వకాల సర్వావస్థల యందు కైంకర్యమును చేయు భాగ్యమును ప్రసాదించమని ప్రార్థించుట – ఇది తిరుప్పావై సారము.

వ్రేపల్లెలో కరువు సంభవించగా దానిని తొలగించుటకు గోపికలతో శ్రీకృష్ణభగవానుడు వ్రతము

చేయించవలయుననని గోవవృద్ధులు కోరగా అందుకంగీకరించిన శ్రీకృష్ణుడు గోపికల నందరిని ఒకచో గూర్చి వారికి అన్ని విషయములను తెలిపి, 'తెల్లవారు ఝామున రండు, వ్రతము ప్రారంభించవలయు'నని చెప్పి తన యింటికి వెడలి పరుండును. గోపికలు కూడా తమ తమ యిండ్లకు వెడలిపోయిరి. కాని శ్రీకృష్ణ సమాగమమునందు గల త్వరచే, ఆర్తిచే నిద్రపట్టని గోపికలు నిద్రించియున్న గోపికలను కూడా లేపి వారితో కలిసి శ్రీకృష్ణ భగవానుని వద్దకు బయలుదేరుటకు సిద్ధపడిరి.

1. మార్గళిత్తింగల్ మది నిఱైన్ద నన్నాళాల్
నీరాడ ప్పోదువీర్ పోదుమినో నేరిళైయీర్!
శీర్ మల్గు మాయ్ప్పాడి చ్చెల్వచ్చిఱుమీర్ కాళ్!
కూర్ వేల్ - కొడున్దొళిలన్ నన్దగోపన్ కుమరన్
ఏరార్న్దకణ్ణి యశోదై యిళ శ్ఙ్గమ్
కార్మేని చ్చెంగణ్ కదిర్ మది యమ్బోల్ ముగత్తాన్
నారాయణనే నమక్కే పఱై దరువాన్
పారోర్ పుగళప్పడిన్దేలో రెమ్బావాయ్!

'శుభప్రదమైన మార్గశీర్ష మాసము శుక్లపక్షమున వెన్నెల నిండిన రాత్రులు గలవి. స్నానము చేయు తలంపుకల వారందరూ రండు. చక్కని ఆభరణములు ధరించి, సకల సంపదలు నిండిన గోప కులమున నున్న సంపదలు కల గోపికలారా ! వేలాయుధమును ధరించిన నందుని కుమారుడు, విశాలనేత్రములు కల యశోద బాలసింహము నీలమేఘ శ్యాముడు అరుణ నేత్రుడు, సూర్యచంద్ర సన్నిభముఖుడగు శ్రీమన్నారాయణుడే మన వ్రతసాధనమును అనుగ్రహించును. లోకములన్నియు ఆనందించును.'

ఇచట స్నానమనగా శ్రీకృష్ణ సమాగమము. శ్రీకృష్ణ సమాగమమునకై కోరిక కల వారందరూ ఇందుకు అర్హులు. భగవంతుని సేవకు సంకల్పించగానే మంచి కాలము, మంచి వాతావరణము తమకు తామే సమకూరును అని తెలిపిరి. భగవంతుని సేవ చేయ సంకల్పించుటే ఐశ్వర్యము. భగవంతుడు ఆచార్యునకు విధేయునిగా ఉండును. మంత్రమున యధేచ్ఛగా విహరించును. 'మంత్రోమాతా గురుః పితా' అని

ప్రమాణము. యశోద అనగా కీర్తి నిచ్చునది. తల్లి అనగా మంత్రము. నందగోపుడనగా ఆనందమును కాపాడువాడు. ఇచట ఆనందమనగా పరమాత్మ. అతనిని అయోగ్యులకు అందకుండా కాపాడువాడు ఆచార్యుడు. వ్రతమునకు కూడా పరమాత్మ తగిన సాధన సంపత్తిని కూర్చి కొనసాగించును అని బోధించినది.

2. వై యత్తు వాళ్వ వీర్ గాళ్! నాముమ్ నమ్బావై క్కు
చ్చెయ్యుజ్గిరిశైగళ్ కేళీరో, పాఱ్కడలుళ్
పైయ త్తుయిన్ల పరమ నడిపాడి
నెయ్యుణ్ణోమ్ పాలుణ్ణోమ్ నాట్కాలే నీరాడి
మై యిట్టె ళుదోమ్ మలరిట్టు నామ్ ముడియోమ్
శెయ్యాదన శెయ్యామ్ తీక్కుఱళై చ్చెన్ఱోదోమ్
ఐయముమ్ పిచ్చెయు మాన్దనైయు జ్గెకాట్టి
ఉయ్యు మాఱెణ్ణి యుగన్దేలో రెమ్బావాయ్.

శ్రీకృష్ణ భగవాను డవతరించిన కాలమున 'ఈ భూలోకమున పుట్టి దుఃఖమయమగు సంసారమున ఆనందము ననుభవించుచున్న అదృష్టవంతులారా! మేము మా వ్రతమును ఆచరించు విధానమును తెలిపెదము.

తెల్లవారుఝామున లేచి, స్నానమాడి, క్షీరసాగరమున మెల్లగా పడుకొనియున్న పరమ పురుషుని పాదములను కీర్తించెదము. నేతిని భుజింపము. పాలను ఆరగింపము. కంటికి కాటుక పెట్టుకొనము. పూలను ముడువము. పెద్దలు చేయని వానిని చేయము. ఇతరులపై చాడీలు చెప్పము. దానమును భిక్షమును పుచ్చుకొను వారికి తృప్తి కలుగునంత వరకు ఇచ్చి ఉజ్జీవించు విధమును అరయుదుము.'

మొదటి పాశురమున వ్రేపల్లెలోని పడుచులను మాత్రమే పిలిచిరి. కాని ఈ పాశురమున భూమండలము లో నున్న వారందరిని ఆహ్వానించుచున్నారు. దీని వలన ఈ వ్రతము ఒక్క వ్రేపల్లెలోని వారికే కాక ఈ ప్రపంచమున భగవదనుభవరుచి గలిగి తరింప దలచిన వారందరికి సంబంధించినది అని తెలియదగును. 'భగవద్గుణములందు వ్యామోహము కలిగిన మీవంటి వారు చెప్పు హరికథా శ్రవణమే పురుషార్థము. ఈ పాలు పెరుగు నేయి యుండగా ఇతరములగు పాలు పెరుగు నేయి మాకు వలదు. ఇంద్రియనిగ్రహమును మనో నిగ్రహమును

అలవరుచుకొనుటకు ఈ నియమములను ఆచరింతుము' అని, అన్ని శుభములకు ఆనందములకు భగవానుని నామ సంకీర్తనమే ఉత్తమ సాధనమని తెలుపగోరిరి.

3. ఓఙ్గి యులగళన్ద ఉత్తమన్ పేర్ పాడి
నాఙ్గళ్ నంబావైక్కు చ్చాత్తినీరాడినాల్
తీఙ్గిన్డి నాడెల్లామ్ తిఙ్గళ్ ముమ్మారిపెయ్దు
ఓఙ్గు పెరుఞ్జెన్నెల్ ఊడు కయ లుగళ
పూఙ్గువళై ప్పోదిల్ పొఱివండు కణ్ పడుప్ప
తేఙ్గాదే పుక్కిరున్దు శీర్త్తములై పత్తి
వాఙ్గ-క్కుడమ్ నిఱైక్కుమ్ వళ్ళల్ పెరుమ్పశుక్కల్
నీఙ్గాద శెల్వమ్ నిఱై న్దేలో రెమ్బావాయ్.

తాము ఈ వ్రతము నాచరించుటకు అంగీకరించిన వ్రేపల్లెలోని వారికి చక్కని పాడిపంటలు కలుగవలయునని ఆకాంక్షించుచున్నారు. 'పెరిగి లోకములను కొలచిన ఉత్తముడగు త్రివిక్రముని నామమును కీర్తించెదము. మేము మా వ్రతము అను మిషతో స్నానమాడినచో సకల లోకములు ఆనందించును. ఈతి బాధలు లేకుండగా

దేశమంతా నెలకు మూడు వానలు కురియును. ఈ వ్రతము వలన లోకములో పాడిపంటలు సమృద్ధిగా యుండును. పెరిగిన పెద్ద వరి చేలలో చేపలు త్రుళ్ళి పడుచుండును. పూచిన కలువ పూవులో అందమైన తుమ్మెదలు నిద్రించుచుండును. జంకకుండ కొట్టములో ప్రవేశించి కూర్చుండి బలిసియున్న పొదుగును పట్టి పాలు పిదుకుచుండగా కుండల కుండల పాలను అచట ఆవులు ఇచ్చుచుండును. ఇవి ఉదారవములగు ఆవులు. లోకమంతట తరగని సంపద నిండియుండును.'

ఇచట ఉత్తముడనగా గురువు. మూడు అడుగులు నేల యిచ్చుటకు అంగీకరించగానే బలిచక్రవర్తి దగ్గర వామనుడు త్రివిక్రముడైనట్లు మూడు రహస్యముల తెలియుటకు అంగీకరింపగనే శిష్య సందేహ నివృత్తికి ఆచార్యుడు తన యధార్థ స్వరూపమును ప్రదర్శించును. పరమాత్మ జీవుడను విత్తనమును ఈ శరీరమను క్షేత్రమున నాటును. ఈ ఆత్మసస్యము ఫలించుటకు ఈతిబాధలు లేకుండ వలయును. ఈతిబాధలు లోకమున ఆరు.

అతివృష్టి, అనావృష్టి, ఎలుకలు, చిలుకలు, మిడుతలు, దుష్టులగు రాజులు. అట్లే ఆత్మ విషయమున కూడా ఆరు ఈతి బాధలు 1. దేహాత్మ బుద్ధి, 2. నేను స్వతంత్రుడనను బుద్ధి, 3. పరమాత్మ అని కాక ఇతరులకు చెందిన వాడను అను బుద్ధి, 4. తనను తాను రక్షించుకొనగలనను బుద్ధి, 5. శరీర బంధువులే బంధువులను బుద్ధి, 6. శబ్దాది విషయ ములను అనుభవింపవలయునని బుద్ధి.

ఇక మూడు వానలనగా

1. పరమాత్మకే తప్ప ఇతరులకు చెందిన వాడనుగాను అను బుద్ధి.
2. పరమాత్మయే తప్ప ఇతరమగునది ఉపాయము కాదు అను బుద్ధి.
3. పరమాత్మానుభవము తప్ప ఇతరమగునది నాకు రుచింపదు అను బుద్ధి.

క్షేత్రమనగా శరీరము. క్షేత్రమున అడుగున జలమనగా పరమాత్మ. చేపలనగా భగవద్ధ్యానముతో

మాత్రమే జీవించగలుగు భక్తులు, ఈ నీటిలో కలువ పూలనగా జీవుల హృదయములు. అందులోని తుమ్మెదలు అనగా లక్ష్మీనారాయణులు. వారి కలహము జీవుల పరిపాలన విషయముననే.

4. ఆళి మళై క్కణ్ణా ! ఒన్ఱు నీ కైకర్ వేల్
ఆళి యుళ్ పుక్కు ముగన్దు కొడార్ త్తేఱి
ఊళి ముదల్వనురువమ్ పోల్ - మెయ్ కఱుత్తు
పాళి య న్దోళుడై ప్పఱ్పనాబన్ కైయిల్
ఆళి పోల్ మిన్ని వలమ్బురి పోల్ నిన్ఱ దిర్ న్దు
తాళాదే శార్ఙ్గ ముదైై త్త శరమళై పోల్
వాళ వులగినిల్ పెయ్దిడాయ్ - నాజ్గళుమ్
మార్ గళి నీరాడ మగలిన్దే లో రెమ్బావాయ్.

అనన్య భక్తితో పరమాత్మ నాశ్రయించిన వాని వద్ద దేవతలందరు ఆజ్ఞావశర్తులై యుందురు. ఈ గోపికలు ఉత్తముని పేరు పాడి వ్రతమున కుపక్రమించిరి. వెంటనే వారి కోరిక ననుసరించి వర్షాధి దేవతయగు పర్జన్యుడు పాడిపంటలు బాగుగా వృద్ధి చెందుటకు తగిన రీతిగా వర్షించుటకు వారి యెదుట సాక్షాత్కరించెను.

ఇపుడు గోపికలు పర్జన్యునకెట్లు వర్షింపవలయునో అజ్ఞాపించుచున్నారు.

'గంభీర స్వభావము కలిగిన వర్షనిర్వాహకుడా! పర్జన్య దేవా! నీవు ఔదార్యములో సంకోచము నేమాత్రము చూపకుము. గంభీర సముద్ర మధ్యమున కేగి ఆ సముద్ర జలమునంతను త్రాగి, గర్జించి ఆకాశమున వ్యాపించి సర్వజగత్కారణభూతుడగు శ్రీమన్నారాయణుని దివ్య విగ్రహామువలె శ్యామల మూర్తివై, అతని దక్షిణ బాహువునందలి చక్రమువలె మెరిసి, ఎడమ చేతిలోని శంఖమువలె ఉరిమి, శార్ఙము నుండి వెలువడు బాణములవలె లోకమంతయూ సంతోషించునట్లు మేము ఆనందముగా స్నానము చేయునట్లు వర్షింపుము.'

ఇచట మేఘమనగా ఆచార్యులు. భగవంతుని కంటె ఆచార్యులకు కారుణ్యమధికము. మేఘము సముద్రములోని ఉప్పునీరును త్రాగి మధుర జలమును లోకమున వర్షించును. ఆచార్యులు కఠినములు దురవగాహములగు శ్రుతిసాగర జలములను త్రావి వాటిని సులభశైలిలో

బోధింతురం. భగవద్గుణములను శిష్యులకు బోధింపవలయును. ఆ గుణములు రెండు విధములుగా నుండును.

ఆశ్రయణ సౌకర్యాపాదక గుణములు

ఆశ్రిత కార్యాపాదక గుణములు

1) భగవంతుడు మనచే ఆశ్రయించుటకు అందు బాటులో నుండువాడే అని తోచి ఆశ్రయించుటకు వీలు కల్పించు గుణములు.

2) ఆశ్రయించిన వారి కార్యములను చేయగలవాడు అనునట్లు స్ఫురింపచేయు గుణములు.

ఆచార్యునకు జ్ఞానమే కాక తెలిసినది ఆచరించుటే మెరుపు. శంఖమువంటి ధ్వనియనగా ఆచార్యుడు చేయు వేదఘోష. మేఘము వర్షించునట్లుగా ఆచార్యుడు భగవద్గుణానుభవమును వర్షించును.

5. మాయనై మన్ను వడమదురై మైన్దనై
త్తూయ పెరునీర్ యమునై త్తురైవనై
ఆయర్ కులత్తినిల్ తోన్ఱుమ్ మణివిళక్కై

త్తాయైక్కుడల్ విళక్కమ్ శెయ్త తామోదరనై
తూయోమాయ్ వన్దు నామ్ తూమలర్ తూవిత్తొళుతు
వాయినాల్ పాడి మనత్తినాల్ శిన్దిక్క
ప్పోయపిళైయుమ్ పుగుదరువా నిన్టనవుమ్
తీయినిల్ తూశాగుమ్ శెప్పేలో రెమ్బావాయ్.

'ఆశ్చర్యకర చేష్టలు కలిగి నిత్యము భగవత్సం బంధము కల ఉత్తరదేశమందలి మధురానగరికి నిర్వాహకుడును, యమునా నదీ తీర విహారి, గోపవంశమున ప్రకాశించిన మంగళదీపము, తల్లియగు యశోద గర్భమును ప్రకాశింప చేయునటుల, తాడుచే కడుపున కట్టబడిన దామోదరుడు అగు శ్రీకృష్ణ భగవానుని చేరి పరిశుద్ధములగు పుష్పములతో పూజించి, వాక్కుతో కీర్తించి, మనసారా ధ్యానించినచో పూర్వ సంచిత పాపరాశి, ఆగామి పాపరాశి, అగ్నిలో పడిన దూదివలె నశించును. భగవన్నామమును పాడుము.'

'వ్రతమాచరించుటకు మన సంచిత ఆగామి పాపములు అడ్డురావా?' అను శంకకు భగవంతుని

నోరారా కీర్తించి మనసారా ధ్యానించినచో అన్ని నశించును అని తెలిపెను.

భగవానుని వలె ఆచార్యుడు కూడా అత్యాశ్చర్య కరములగు చేష్టలు కలవాడే. శ్రీకృష్ణ భగవానుడు యమునా తీర విహారి. ఆచార్యుడు విరజానదీ తీర విహారి. అజ్ఞానులగు జీవుల కులమును సదుపదేశముతో ప్రకాశించి చేయువాడు. మంత్ర గర్భమున భక్తితో కట్టుబడి ప్రకాశింప చేయువాడు, అహింసాది పుష్పములతో అర్చించబడి మన విఘ్నములను నశింపచేయువాడు ఆచార్యుడు.

6. పుళ్ళుమ్ శిలుమ్బినకాణ్ పుళ్ళరైయన్ కోయిలిల్
వెళ్ళై విళిశజ్గిన్ పేరరవమ్ కేట్టిలైయో
పిళ్ళాయ్ ! ఎళున్దిరాయ్ పేయ్ ములైనఙ్జుణ్డు
కళ్ళచ్చగడమ్ కలక్కళియక్కాలోచ్చి
వెళ్ళత్తరవిల్ తుయి లమర్న్ద విత్తినై
ఉళ్ళత్తు క్కొణ్డు మునివర్ గళుమ్ యోగిగళుమ్
మెళ్ళ వెళున్దు అరియెన్ఱ పేరరవమ్

ఉళ్ళమ్ వుగున్దు కుళిర్న్దేలో రెమ్బావాయ్.

ఇచట నుండి పది పాశురములతో పదిమంది గోపికలను లేపుట చెప్పబడును. ఇచట పదిమంది గోపికలనగా పది ఇంద్రియములు, పదిమంది ఆళ్వారులు. గురువాక్య పరంపర కూడా ఈ పది పాశురములచే బోధించబడును.

ఈ పాశురమున – భగవదనుభవము క్రొత్తయగుట వలన ఈ వైభవము తెలియని తానొక్కతే తన భవనములో పరుండి వెలికిరాని ఒక ముగ్ధను లేపుచున్నారు. లేపుటకు తెల్లవారవలయును కదా! తెల్లవారుటకు గురుతులు చెప్పుచున్నారు.

'పక్షులు అరచుచున్నవి. దేవాలయమున శంఖము చేయు పెద్ద ధ్వని వినరాలేదా! ఓ పిల్లా! లెమ్ము. పూతన చనుబాల విషమును ఆరగించి కపట శకటాసురుని కాలు చాచి సంహరించి పాలసముద్రముపై చల్లని తెల్లని మెత్తని శేషశయ్యపై పవళించియున్న జగత్కారణ భూతుడగు శ్రీమన్నారాయణుని తన హృదయమున నిలుపుకొని

మెల్లగా లేచిన మునులు యోగులు 'హరి హరి' యను చేయు పెద్దధ్వని మా హృదయమున చొరబడి చల్లబరిచి మమ్ములను మేల్కొలిపినది. నీవు కూడా లేచి రమ్ము.'

ఇచట పక్షులనగా ఆచార్యులు. పక్షులు రెండు రెక్కలతో ఆకాశమున నెగురునట్లు ఆచార్యుడు జ్ఞానాను ష్ఠానములతో పరమాత్మయందు విహరించు చుండును. శంఖధ్వని యనగా ఓంకార ధ్వని. అనగా జీవుడు పరమాత్మకు దాసుడు అని, భక్తునకు దాసుడు అని. ఇచట పూతన యనగా ప్రకృతి. పూతన స్తనములు అహంకార మమకారములు. విషము శబ్దస్పర్శ రూప రసగంధములను విషయములు. శకటాసురుడనగా సుఖము నంతమొందించు ఈ శరీరము.

ఈ పాశురమున పెరియాళ్వార్లను మేల్కొలుపు చున్నారు.

ఇందులో 'పిళ్ళాయ్' అనికదా సంబోధన. ఇది అజ్ఞానమును సూచించును. ఈ అజ్ఞానము జ్ఞాన విపాకము వలన ఏర్పడినది.

'పాండిత్యం నిర్విద్య బాల్యేన తిష్ఠాసేత్' అనికదా శ్రుతివాక్యము. అందులో ఆండాళు తల్లి తమ జనకులను మొదట స్మరించుట ఔచిత్యము కూడా. వల్లభరాయల సభలో వీరి విజయోత్సవమున ఏనుగుపై ఊరేగింపు జరుగుచుండగా శ్రీమన్నారాయణుడు శ్రీభూనీలా సమేతులై గరుడవాహనారూఢులై వేంచేయగా వారికి మంగళా శాసనము గావించిరి. ఇది ప్రేమదశలో చేయు కార్యము. ప్రేమదశలో జ్ఞానదశ అడుగంటును. ఇట్లు జ్ఞానపరిపాక కార్యమగు అజ్ఞాన కార్యము గావున వీరు 'పిళ్ళాయ్' అగును.

ఇక ఈ పాశురమున గురుపరంపరా వాక్యము 'అస్మద్గురుభ్యోనమః' అనునది. గురువులు కొత్తగా సిద్ధాంత ప్రచారమును ప్రారంభించిన వారగుట వలన 'పిళ్ళాయ్' అనునది సరిపడును.

7. కీశు కీశెన్ఱెజ్గు మానై చ్చాత్త జ్గలన్దు
పేశిన పేచ్చరవమ్ కేట్టిలైయో పేయ్ప్పెణ్ణే!
కాశుమ్ పిఱప్పుమ్ కలగలప్పక్కై పేర్తు
వాశ నఱుజ్గుళ లాయ్చ్చియర్; మత్తినాల్

ఓశైప్పడుత్త త్తయిరరవమ్ కేట్టిలైయో
నాయకప్పెణ్పిళ్లాయ్! న్నారాయణన్ మూర్తి
కేశవనై ప్పాడవుమ్ నీకేట్టే కిడత్తియో
తేశముడై యాయ్! తిఱ వే లోరెమ్బావాయ్.

"కీచుకీచుమని అంతటను భరద్వాజ పక్షులు కలుసు కొని పలుకు మాటల ధ్వని వినలేదా? పిచ్చి పిల్లా! మెడలోని తాళిబొట్టు కాసులపేరు ధ్వనించునట్లు చేతులూపుచు తలలోని పూవులు జారి, పరిమళము కల కేశపాశములు గల గోప యువతులు కవ్వముతో పెరుగు చిలుకు చప్పుడు వినలేదా? నాయకురాలా! అన్ని పదార్థములందు తానుండి, వాటికి కనిపించకుండా వాటిని నిలుపుచు, వాని కాధారమై నియామకుడై వాని కాత్మయైన నారాయణుడు పామరులకు కూడా చర్మ చక్షువులతో చూచుటకు వీలుగా రూపము దాల్చిన సులభుడు. తనను ఆశ్రయించిన మన విరోధులను తన శ్రమను కూడా లెక్కించక హింసించు, కరుణామయుడగు కేశవుని (కేశిని వధించినవాడు) కీర్తించిననూ, విని కూడా పరుండియే ఉంటివా? తేజశ్శాలినీ తలుపు తెరువుము."

భారద్వాజ పక్షుల పలుకులనగా శ్రోత్రియులగు బ్రాహ్మణులు తెల్లవారు ఝామున లేచి తాము వేదమును చదువుకొనుచు, శిష్యులకు చెప్పుకొనుట. రాత్రియనగా తమోగుణము. తెల్లవారుట యనగా సత్త్వగుణము.

పెరుగు చిలుకుట యనగా క్షీరసాగర మథనము. ఇచట సముద్రము భగవానుడు. పాలు భగవత్స్వరూప రూపగుణ విభూతులు. మథించుట యనగా మననము చేయుట. భగవానుని యందు నిలిపిన బుద్ధియే మందరము. శ్రద్ధయే వాసుకి. భగవత్కటాక్షమే అమృతము. గోవులనగా వాక్కులు, వేదములు. వాని వలన వచ్చు పాలు భగవద్గుణములు.

మంగళ సూత్రము ఆచార్యుడు చేయు భగవన్మంత్రోపదేశము. కాసులపేరు ఆచార్యునియందు మనకు కలుగు భక్తి. వీటి ధ్వని భాగవతుల యందు భక్తి. భగవద్భక్తియే కేశపాశము. భగవంతునితో మనకు గల సంబంధ జ్ఞానము పుష్పము. అది పరిమళించుట యనగా ఫలసంగ కర్తృత్వములు లేకపోవుట.

ఇచట కేశి అశ్వరూపియగు రాక్షసుడు. అశ్వమనగా ఇంద్రియము లేదా అహంకారము. వీటిని నిలువరించగలవాడు ఆచార్యుడు. లేదా భగవంతుడు. అతనిని అభిముఖుని కమ్మని ప్రార్థించుచున్నారు.

ఈ పాశురమున కులశేఖరాళ్వారులను మేల్కొలుపుచున్నారు.

'నాయకప్పెంబిళ్ళాయ్' అనుటచే కులశేఖరులు ఆళ్వారుల రత్నమాలలో మధ్యనాయకమణిగా అలరారుచున్నందున కులశేఖరులు తెలియుదురు.

మరియు 'తేశముడయాయ్' అనునది తేజశ్శాలీ, అని కదా తెలుపును. కులశేఖరులు క్షత్రియులు కావున తేజస్సు సహజ గుణము కదా. ఇంకనూ ఈ పాశురమున 'ఆనైచ్చాత్తు' అని మలయాళ భాషాపదమును వాడిరి. కావున మలయాళ దేశమున జన్మించిన కులశేఖరులను తెలుపును.

ఇక గురుపరంపరలో 'అస్మత్పరమగురుభ్యోనమః' అను వాక్యమును అనుసంధానము గావించుకొన

వలయును. ఇచట గురువునకు గురువులు పరమాచార్యులు నాయకప్పెణ్పిళ్ళాయ్ కదా.

8. కీళ్ వానమ్ వెళ్ళెన్ఱు ఎరుమై శిఱు వీడు
మేయ్వాన్ పరన్దనకాణ్! మిక్కుళ్ళ పిళ్ళైగళుమ్
పోవాన్ పోగిన్ఱారై ప్పోగామల్ కాత్తున్నై
కూవువాన్ వన్దు నిన్ఱోమ్; కోదుకల ముడైయ
పావాయ్! ఎళున్దిరాయ్, పాడిప్పఱై కొణ్డు
మావాయ్ పిళన్దానై మల్లరై మాట్టియ
దేవాది దేవనై చ్చెన్ఱు నామ్ శేవిత్తాల్
ఆవా వెన్ఱారాయ్న్దు అరుళేలో రెమ్బావాయ్.

"తూర్పు దిక్కు తెల్లవారుచున్నది. చిన్నబీడు మేయుటకు విడువబడిన గేదెలు విచ్చలవిడిగా పోవుచున్నవి. మిగిలిన గోపికలందరు వ్రతస్థలమునకు బయలుదేరగా వారిని ఆపి నిన్ను పిలుచుటకు నీ వాకిట వచ్చి నిలిచినాము. కుతూహలము కలదానా? లేచి రమ్ము! కృష్ణ భగవానుని గుణములను కీర్తించి వ్రతమును మొదలిడి వ్రతసాధనమును పొంది, కేశిని చంపిన వానిని,

చాణూరముష్టికులను వధించిన వానిని, దేవాది దేవుని, సేవించినచో అయ్యో! అయ్యో! మీరే వచ్చితిరే అని బాధపడి మన మంచి చెడ్డలను విచారించి కటాక్షించును."

తూర్పు దిక్కున తెల్లవారుట యనగా మన మనసున సత్త్వగుణముదయించి రాజస తామస భావములు తగ్గుటయే. కాని పూర్తిగా తొలగుట కాదు. ఇట్లు తగ్గుటయే చిన్నబీడు లోనికి గేదెలు పోవుట. ఇది కేవలము చిత్త ప్రసాదమే.

పరమాత్మను ప్రేమించువారిని ముందు నిడుకొని వెళ్ళనలయునని నీ వాకిలి వద్ద నిలచితిమి. ఇదియే మాకు పరమ ప్రయోజనము. ఆచార్య గృహద్వారమున నిలువ గలుగుటయే శిష్యునకు ముఖ్య గృహద్వారమున నిలువ గలుగుటయే శిష్యునకు ముఖ్య ప్రయోజనము, అశ్వము అహంకారము. చాణూర ముష్టికులు కామక్రోధములు. అహంకారమును, కామక్రోధములను ఆచార్య కటాక్షముచే పరమాత్మ తొలగించును.

ఈ పాశురమున నమ్మాళ్వారులను మేల్కొలుపుచున్నారు. 'కోదుకులముడయపావాయ్?' అనికదా సంబోధన. వ్యామోహము కల పిల్ల అని యర్థము.

'ఋషిం జుషా మహే కృష్ణతృష్ణాతత్త్వమివోదితం' అని కదా స్తుతి. ఇచట 'కృష్ణ తృష్ణాతత్త్వం' అనగా కృష్ణునికి గల తృష్ణ, కృష్ణుని యందు కల తృష్ణ అని రెండు విధములుగా చెప్పుకొనవచ్చును గాన నమ్మాళ్వార్లు 'కోదుకుల ముడయపావాయె' గదా.

నమ్మాళ్వార్లు తిరువాయ్ మొళిలో తమను పావాయ్ గా చెప్పుకొనిరి కాన ఇచట పావాయ్ సంబోధన వీరికే అని తెలియనగును.

ఇక వాక్య పరంపరలో 'అస్మత్సర్వ గురుభ్యోనమః' అనుదానిని అనుసంధానము చేయవలయును. కుతూహలము కలవారు అనగా వీరికి భగవంతునియందు భాగవతోత్తముల యందు కుతూహలము కలవారే సర్వగురువులు కదా.

9. తూమణి మాడత్తు చ్చుత్తుమ్ విళక్కెరియ
తూపమ్ కమళ త్తుయిలణై మేల్ కణ్ వళరుమ్
మామాన్ మగళే మణిక్కదవమ్ తాళ్ తిఱవాయ్
మామీర్! అవళై యెళుప్పీరో! ఉన్ మగళ్ దాన్

ఊమైయో? అన్టి చ్చెవిడో? అనన్దలో
ఏమప్పెరున్దుయిల్ మన్దిరప్పట్టాళో?
"మామాయన్, మాదవన్, వైగున్దన్" ఎన్తెన్టు
నామమ్ పులవుమ్ నవి న్టేలో రెమ్బావాయ్!

ఇందులో లేపబడు గోపిక అద్దాలమేడలో పరుండి యున్నది. ఈ మేడ "పరిశుద్ధములగు నవవిధ మణులతో నిర్మించబడినది. ఈ మేడలో సుఖశయ్యపై చుట్టు దీపములు వెలుగుచుండగా అగరు, ధూపము పరిమళించు చుండగా నిద్రపోవుచున్న ఓ అత్తకూతురా! మణికవాటపు గడియ తీయుము. ఓ అత్తా! నీవైననూ ఆమెను లేపుము. నీ కుమార్తె మూగదా? లేక చెవిటిదా? లేక జాడ్యము కలదా? ఎవరైన కదిలిన ఒప్పమని కావలియున్నారా? గాఢనిద్ర పట్టునట్లు మంత్రించినారా? 'మహా మాయావీ! మాధవా! వైకుంఠ హాసా!' అని అనేక నామముల కీర్తించి ఆమె లేచునట్లు చేయుము."

మణులు తొమ్మిది విధములు. భగవంతునితో జీవునకుండు సంబంధములు తొమ్మిది.

1. పిత 2. రక్షకుడు 3. శేషి 4. భర్త 5. జ్ఞేయుడు 6. స్వామి 7. ఆధారము 8. ఆత్మ 9. భోక్త. ఈ తొమ్మిది సంబంధములతో పరమాత్మను భావించుట 'ప్రజ్ఞ' యనబడును. ఈ ప్రజ్ఞయే మణిమయ భవనము. చుట్టు దీపమనగా శాస్త్రము వలన కలిగిన జ్ఞానదీపము. అగరుధూప పరిమళమనగా జ్ఞానము మాత్రమే కాక అనుష్ఠానమును కూడా సూచించును. భగవంతునిపై పరిపూర్ణముగా భారముంచుటయే హాయిగా నిద్రించుట. మణులతో నిర్మించిన తలుపు లనగా వ్యామోహ జనకములగు అహంకార మమకారములు. ఇవి ఆచార్య కటాక్షముచే మాత్రమే తొలగుమ. భగవంతుని యందు దృఢాధ్యవసాయము కలవారు మూగవారుగా చెవిటివారిగా బద్ధకస్తులుగా కనపడుదురు. వీరిని మంత్రించునది కావలి యుండునది భగవంతుడే. వీరు ఇతర విషయములను పట్టించుకొనరు.

ఈ పాశురమున తిరుమళిశయాళ్వార్లను మేల్కొలుపుచున్నారు. ఇచట 'మామాన్ మకళే' అనికదా సంబోధన. గోదను లక్ష్మికి తోబుట్టువుగా చెప్పుచున్నందున

లక్ష్మి భృగుమహర్షి పుత్రిక, ఈ యాళ్వార్లు కూడా భృగువంశ సంజాతులే. కావున వీరు 'మామాన్ మగలే' అగుదురు. ఇక ఆళ్వారు తమను చూచి వేదపాఠమును ఆపిన బ్రాహ్మణులు తాము ఆపిన భాగమును మరచిపోగా వీరు నోటితో చెప్పక ఒక నల్లని ధాన్యము గింజను గోటితో గిల్లి పారవేసి 'కృష్ణానాం వ్రీహీణాం న ఖనిర్భిన్నం' అను మంత్రమును గుర్తుచేసిరి. ఇది వీరి మూగతనము. 'ఊమయో' అనికదా ఇచట చెప్పినది.

ఇక గురు పరంపరలో 'శ్రీమతే రామానుజాయ నమః' 'జ్ఞాతార స్తనయాః' అనుట వలన ఆండాళ్ అందరికి తల్లి. 'భ్రాతా చేత్ యతిశేఖరః' అని భగవద్రామానాజులు ఆండాళుకు అన్నగారు. కావున మనకు యతిశేఖరులు మామకదా. పరంత్రులు కావున 'మగళే' కూడా. ఇట్లు ఈ పాశురమున 'శ్రీమతే రామానుజాయ నమః' అను వాక్యము బోధించబడినది.

10. నోత్తు చ్చువర్క్కమ్ పుగుగిన్ఱ అమ్మనాయ్!
మాత్తముమ్ తారారో వాశల్ తిఱవాదార్

నాత్తత్తుళాయ్ ముడి నారాయణన్; - నమ్మాల్
పోత్తప్పఱై తరుమ్ పుణ్ణియనాల్! పణ్డొరునాళ్
కూత్తత్తిన్ వాయ్ వీళ్ న్ద కుమ్బకరణనుమ్
తోత్తు మునక్కే పెరున్దుయిల్ తాన్ తన్దానో?
ఆత్త అనన్దలుడై యాయ్! అరుఙ్గలమే!
తేత్తమాయ్ వన్దు తిఱవే లో రెమ్బావాయ్.

"మేము రాకముందే నోము నోచి దాని ఫలముగా సుఖానుభవమును పొందిన తల్లీ! తలుపు తెరువక పోయిననూ మాటనైననూ పలుకరాదా? పరిమళము నిండిన తులసి మాలలు కిరీటమున అలంకరించుకొనిన నారాయణుడు మేము మంగళము పాడిననూ పరనిచ్చు పుణ్యమూర్తి. అతనిచే ఒకనాడు మృత్యువులో పడవేయబడిన కుంభకర్ణుడు నీకు ఓడి తన నిద్రను నీకిచ్చెనో! నిద్ర నుండి లేచి మైకము వదిలించుకొని తేరుకొని వచ్చి తలుపు తెరువుము. నోరు తెరిచి మాటాడుము."

ఇచట నోము అనగా శరణాగతి వ్రతము, ఏకాదశీ

వ్రతము, శ్రీవ్రతము. ఇది భగవంతుడు మాత్రమే ఉపాయము అని నమ్ముట.

ఇచట తలుపు అనగా అహంకారము. వాక్కు అనగా మంత్రోపదేశము.

కుంభకర్ణుడనగా తామసి. 'కుంభకరణ' అనగా అగస్త్యుడు.

1. అగస్త్యుడు వింధ్య పర్వతమును పెరుగకుండా నిలిపెను = ఇది అహంకారమును అణుచుట.
2. సముద్ర జలమును త్రావుట = వేదశాస్త్రాధ్యయనము.
3. వాతాపిని జీర్ణించుకొనుట = మృత్యువును జీర్ణించు కొనుట.

ఈ పాశురమున పేయాళ్వారులను లేపుచున్నారు.

పొయ్గై పూదత్తాళ్వారులు జ్ఞానదీపమును వెలిగించి చీకటిని పోగొట్టగా పేయాళ్వారులు స్వామిని అమ్మవారిని సేవించిరి. 'ఇదియేనోత్తు చ్చువర్కం' 'పుగుగిన్నవమ్మనాయ్'

ఈ విషయమునే రామానుజ నూత్తందాదిలో 10వ పాశురములో ఇట్లు చెప్పియున్నారు.

మన్నియ పేరిరుళ్ మాండపిన్ కోవలుళ్ మామలరాళ్
తన్నొడు మాయనై కండమైకాట్టుం తమిల్ తలైవన్ అని.

వీరు పెరుమాళ్ళను సేవించిన విధమునే 'తిరుకండేన్ పొన్ మేనిక్కండేన్' అని పాశురములో పాడించిరి.

ఇక వీరు పొయ్గై పూదత్తాళ్వారుల తరువాత వచ్చినవారు. కావున వీరి తరువాత ఇంకెవరు రాలేదు. కాన వీరెవరికి తలుపు తెరువలేదు. అందుకే 'వాశల్ తిరువాధార్' అనునది సరిపోవును.

ఇక వాక్యగురుపరంపరలో 'శ్రీపరాంకుశదాసాయ నమః' అను వాక్యమును అనుసంధానము చేసుకొనవలయును.

వీరు మహాపూర్ణులు కదా! కావున వీరు విడిగా నోము నోచవలసిన పనిలేదు. శ్రియఃపతిని యనుభవించుటే వీరి నోము. అందువలన ఇచట ఈ వాక్యము

సరిపడును.

11. కత్తు క్కఱవై క్కణంగళ్ పల కఱన్దు
శెత్తార్ తిఱ లళియ చ్చెన్టు శెరుచ్చెయ్యుమ్
కుత్త మొన్టిల్లాద కోవలర్దమ్ పొత్కొడియే
పుత్తర వల్గుల్ పునమయిలే పోదరాయ్
శుత్తత్తు తోళిమారెల్లారుమ్ వన్దు; నిన్
ముత్తమ్ పుగున్ద ముగిల్ వణ్ణన్ పేర్పాడ
శిత్తాదే పేశాదే శెల్వప్పెణ్డాట్టి, నీ
ఎత్తు క్కుఱఙ్గుమ్ పొరుళే లోరెమ్బావాయ్.

"లేగదూడలు గల చాలా ఆవుల మందలకు పాలు పిండి, శత్రువుల బలము నశించునటుల ఎదిరించి యుద్ధము చేయు గోపాలవంశములో దోషములు లేని దానవైన బంగారు తీగా! పుట్టలోని సర్పము వంటి నితంబము కలదానా! అడవిలో నెమిలివంటి కేశపాశము కలదానా! లేచిరమ్మా! చుట్టాలు చెలులు అందరూ వచ్చిరి. నీ ముంగిట నిలిచిరి. నీలమేఘశ్యాముని కీర్తించుటకే వచ్చిరి. ఉలుకవు. పలుకవు. సంపన్నురాలా నీ నిద్ర

కర్థమేమి?"

ఆవులనగా వేదములు. దూడలనగా వేదాంగములు. పాలనగా సారము. పిండుట అనగా అందించుట. ఇది ఆచార్యుల పని. శత్రువులనగా కామక్రోధాద్యరిషడ్వర్గము. కామాదులను ఆచార్యుడే తొలగించవలయును.

పుట్టలోని పాము అనగా మూలాధారము నందలి కుండలిని శక్తి. నెమిలి వంటి కేశపాశమనగా సహస్రారము.

చుట్టాలు, చెలులు భగవద్భక్తులు.

భక్తుల ఇంటి ముందు నిలుచుటే పరమ ప్రయోజనము.

నిద్ర అనగా భగవద్గుణాను సంధానము.

ఈ పాశురమున పూదత్తాళ్వారులను మేల్కొలుపు చున్నారు.

'కుత్తమొన్నిల్లాద' అనునది వీరికి సరిపోవును.

ఇతరాళ్వారులందరు గర్భవాసము గావించి జన్మించిరి. ముదలాళ్వార్లు మాత్రమే అయోనిజులు. కావున ఏ మాత్రము దోషము లేనివారు.

వీరు సాధించిన రెండవ తిరు వందాదిలో 'అంకోల్' 'తేడియోడుం' 'కోళున్దదే పోన్నమాల్ తేడియోడుం మనం' అని పందిరి స్తంభమును వెతుకుకొనుచు వెళ్ళుతీగగా తనను తాను చెప్పుకొనినారు. కావున వీరు 'కోవలర్దం పొర్కొడియే' కదా.

ఇక 'శుత్తత్తు తోళిమారు' అని వీరికి పొయ్‌గ పేయాళ్వార్లు చుట్టు ఉండు సఖియలు. ఇతరాళ్వార్లు చెలులు మాత్రమే అని కూడా ఈ విశేషణము వీరికి సరిపోవుచున్నది.

ఇక గురు పరంపరా వాక్యములలో

'శ్రీమద్యామున మునయే నమః' అనువాక్యము ఇచట అనుసంధానము చేసుకొనవలయును.

ఇచట 'కోవలర్' అనగా గోపాలురు.

గోపాలురకు శ్రీకృష్ణుడే భగవానుడు. ఇతర దైవము

లేదు. అనగా భగవదనన్యార్హ శేషభూతులు. అనన్య భక్తి కలవారు. 'లోకీఖ వతీర్ణ పరమార్థ సమగ్రభక్తి యోగాయ నాథమునయే' అని సాధించినట్లు నాథ మునుల వంశమున అవతరించిన మహానుభావులు శ్రీమద్యామున మునులు. కావున వీరు 'కోవలర్ దం పొర్కొడియే' అగుదురు.

12. కనైత్తిళజ్గత్తెరుమై కన్రుక్కిరజ్గీ,
నినైత్తుములై వళియే నిన్రుపాల్‌శోర,
ననైత్తిల్లమ్ శేఱాక్కుమ్ నచ్చెల్వన్తజ్గాయ్!
పని త్తలైవీళ నిన్‌వాశల్ కడైపత్తి
చ్చినత్తినాల్ తెన్నిలజ్గై క్కోమానై చ్చెత్త
మనత్తుక్కిని యానై ప్పాడవుమ్ నీవాయ్ తిఱవాయ్
ఇనిత్తా నెలున్దిరాయ్ ఈదెన్న పేరు అక్కమ్
అనైత్తిల్లత్తారు మఱిన్దే లో రెమ్బావాయ్.

"పాలు పితుకు వారు లేకపోవుటచే లేగదూడలు గల గేదెలు దూడలపై మనసు పోయి అరుచుచున్నవి. దూడలు వచ్చి త్రాగుచున్నటుల తలచి పొదుగు నుండి పాలు కారుచుండగా కారిపోయి, ఇల్లంతయు బురద

యగునట్లు చేసిన మంచి సంపదగల వాని చెల్లెలా! మంచు తలపై పడుచుండగా నీ వాకిటి పై దండ పట్టుకొని నిలిచియున్నాము. కోపముతో దక్షిణ లంకాధిపతిని చంపిన మనోభిరాముని కీర్తించిననూ నీ నోరు విప్పి మాటాడవా. లేవవా? ఇదెక్కడి నిద్ర. లోకులందరు తెలిసిరి."

ఇచట గేదె అనగా సంస్కృతమున మహిషి. మహిషి యనగా లక్ష్మీదేవి. ఆమె పురుషకారమునకు మూలము. పురుష కారము కలవారు ఆచార్యులు. దూడలనగా శిష్యులు. శిష్యులకై దయతలచి చేయు జ్ఞానోపదేశమే పాలుకారుట. భగవద్దాస్యమే సంపద.

ద్వారమనగా తిరుమంత్రము. పైకమ్మి అనగా 'నమః' అనునది. భగవద్భాగవత సేవలో కలుగు ఆనందము నాది కాదు అనుకొనుట పైకమ్మిన పట్టుకొనుట.

లంక యనగా శరీరము. దక్షిణ దిక్కు మృత్యువు స్థానము. రావణుడు మనసు. ఆ మనసును నిగ్రహించునది ఆచార్యోపదేశము. 'ఆచార్యా! మౌనము

ధాల్చరాదు. జ్ఞానబోధను గావించుడు' అని సారాంశము.

ఈ పాశురమున పొయ్‌గయాళ్వారులను మేల్కొలుపు చున్నారు. 'తంగాయ్' అను సంబోధనతో ఇది సూచించ బడుచున్నది. తంగైయనగా శ్రీమహాలక్ష్మి పేరు. శ్రీమహాలక్ష్మి పద్మమునుడి పుట్టినది. ఈ యాళ్వారు కూడా తామర పూవులోనే అవతరించిరి. కావున 'తంగా' యని పొయ్‌గయాళ్వారుకు సంకేతము.

'కనుక్కిఱంగి' ఈ ఆళ్వారులు ముదల్ తిరువందాది ప్రబంధమును సాదించినది దూడలవలె అమాయకులు అజ్ఞులగు చేతనుల విషయమున గల కృపచేతనే అని మొదలియాళ్వాను వీరి విషయమున సాదించివ తనియచే సూచింపబడును.

ఇక గురుపరంపరలో 'శ్రీరామమిశ్రాయ నమః' అను వాక్యమును అనుసంధానమును చేసుకొనవలయును. 'న చ్చెల్వంతంగాయ్' అనునది వీరికి సరిపోవును. 'ననైత్తిల్లం శేరార్కుం నచ్చెల్వం' ఇల్లంతయూ బురదయై ఆ బురదలోనే ఇంటివారు మునిగి పోయిరని దానిని

సంపదగా గలవారని దాని కర్థము.

శ్రీరామమిశ్రులు ఆచార్యనిష్ఠచే ఆచార్యపుత్రిక బురదలో కాలిడుటకు సంకోచించినపుడు తాము ఆ బురదలో పరుండి గురుపుత్రికను బురద దాటించిరి. ఈ ఆచార్య నిష్ఠయే వీరి మంచి సంపదయని తెలియనగును. శ్రీరామమిశ్రులకు రామకథ చాలా ఇష్టము. అందుకే ఈ పాశురమున తెన్నిలంకై కోమానై చెత్త' మనత్తుక్కినియానై పాడవుం నీ వాయ్ తిరువాయ్' అని రామకథను పాడించిరి.

**13.** పుళ్ళిన్‌వాయ్ కీణ్డానైప్పొల్లా వరక్కనై,
క్కిళ్ళిక్కళైన్దానై క్కీర్తిమై పాడిప్పోయ్,
ప్పిళ్ళైగళెల్లారుమ్ పావైక్క ళమ్పుక్కార్,
వెళ్ళియెళు న్దువియాళముఱఙ్గిత్తు,
పుళ్ళుమ్ శిలుమ్బిన గాణ్ పోదరి క్కణ్ణినాయ్,
కుళ్ళక్కు ళిరక్కుడైన్దు నీరాడాదే,
పళ్ళిక్కిడత్తియో వాపాయ్ నీనన్నాళాల్,
కళ్ళమ్ తవిర్న్దు కలన్దేలో రెమ్బావాయ్.

"పక్షి (కొంగ) శరీరమున ఆవేశించిన బకాసురుని నోరు చీల్చి, తన్ను కాపాడుకొని, మనను కాపాడిన శ్రీకృష్ణ భగవానుని, దుష్టరాక్షసుడగు రావణుని పదితలలను విలాసముగా గిల్లి పారవేసిన శ్రీరామచంద్రుని గానము చేయుచు పిల్లలందరును వ్రతము చేయవలసిన ప్రదేశమునకు వెళ్ళుచున్నారు. తుమ్మెదలో నున్న తామరపూవులబోలిన కన్నులు గలదానా! శుక్రుడు ఉదయించు చున్నాడు. గురుడస్తమించు చున్నాడు. పక్షులు కూయుచున్నవి. విరహతాపము తీరునట్లు చల్లగా మునిగి స్నానమాడక శయ్యపై పరుండుటేల? ఈ మంచిరోజున నీవు కపటమును వదిలి మాతో కలిసి ఆనందము ననుభవింపుము."

ఇచట కొంగయనగా దంభము. ఇతరులను హింసించ దలచినవాడు తన స్వభావము తెలియరాకుండగా సజ్జనునిగా కన్పట్ట చూచుట దంభము.

రావణుడనగా అహంకారము. అహంకారమును తొలగించునది ఆచార్యుడు భగవన్నామ సంకీర్తనముచే

అహంకారము తొలగును.

భాగవతోత్తములలో ఒక్కరు తక్కువున్ననూ రసపూర్తి యుండదు. అందరూ కావలయును.

శుక్రుడనగా జ్ఞానము. బృహస్పతి యనగా అజ్ఞానము. పక్షులనగా ఆచార్యులని మొదటే చెప్పి యుంటిమి.

నేత్రమనగా జ్ఞానము. నేత్ర సౌందర్యమనగా భాగవతోత్తముల స్వరూపమును తెలియకలుగుట. స్నానమనగా భగవత్సంశ్లేషము.

భగవదనుభవమును ఒంటిగా చేయుటయే కపటము. అందరితో కలిసి చేయవలయును.

ఈ పాశురమున తొండరడిప్పొడి యాళ్వారులను మేల్కొలుపుచున్నారని తెలియవలయును.

ఈ పాశురమున 'పోతరికణ్ణినాయ్' అని పిలిచి యున్నారు. పూలను సమకూర్చుటలో దృష్టి నిలిపిన వారు అని అర్థము. ఈ ఆళ్వార్లు పుష్పకైంకర్య పరాయణులు.

'తొడైత్త, తువళముమ్ పొలన్దు తోన్నియతోళ్ తొండరడిప్పొడి' అని కదా. అనగా అందముగా కట్టబడిన దివ్యములగు తులసి మాలలతో నిండిన బుట్టను భుజము నందు ధరించి ఎల్లప్పుడు దర్శన మొసంగు తొండరడిప్పొడి యానిదాసుని' అని అర్థము. ఈ పాశురమున శ్రీకృష్ణుని శ్రీరాముని పాడిన విధముగనే ఈ ఆళ్వారులు కూడా 'తిరుమాలై' ప్రబంధములో శ్రీకృష్ణుని, శ్రీరాముని చరితమును గానము చేసిరి. ఒక 'పావాయ్' అనగా పతివ్రత. పతివ్రత అనగా భర్త యొక్కనికే వశమైయుండుట. ఈ ఆళ్వారు రంగనాథుని ఒక్కరినే ఆశ్రయించి ఇతర దివ్యదేశములందు వేంచేసియున్న స్వామిని మనసులో కూడా తలచనివారు. కావున ఈ పాశురము వీరికి చక్కగా సరిపోవును.

ఇక గురుపరంపరలోని 'శ్రీ పుండరీకాక్షాయ నమః అను వాక్యమును అనుసంధానము చేసుకొనవలయును. ఇందు 'పోతరిక్కణ్ణినాయ్' అని నేత్ర సౌందర్యమునే చెప్పియున్నారు కదా. ఇచట నేత్రమనగా జ్ఞానము.

సర్వతోముఖముగా విస్తరించు జ్ఞానము కలవారు శ్రీపుండరీకాక్షులు కావున ఈ పాశురమున ఈ వాక్యము సరిపోవును.

14. ఉజ్గళ్ పుళైక్కడై త్తోట్టత్తు వావియుళ్
శెజళ్గ నీర్వాయ్ నెగిళ్న్దు
అమ్బల్వాయ్కూమ్బినకాణ్
శెజ్గల్ పొడిక్కూఱై వెణ్బల్ తవత్తవర్
తజ్గళ్ తిరుక్కోయిల్ శజ్గిడువాన్ పోగిన్ఱార్
ఎజ్గళై మున్నమ్ ఎళుప్పువాన్ వాయ్ పేశుమ్
నజ్గాయ్! ఎళున్దిరాయ్ నాణాదాయ్ నావుడైయాయ్!
శజ్గొడు శక్కర మేన్దుమ్ తడక్కైయన్
పజ్గయక్కణ్ణానై ప్పాడేలో రెమ్బావాయ్.

"మీ ఇంటి పెరటిలోని తోటలోని బావిలో ఎఱ్ఱతామరలు విచ్చినవి. నల్లకలువలు ముకుళించినవి. ఎఱ్ఱని జేగురు రాళ్ళ పొడితో రంగు అద్దబడిన కాషాయ వస్త్రములను దాల్చి, తెల్లని పలువరుసకల సన్న్యాసులు తమ దేవాలయములకు కుంచెకోల పట్టుకొని ఆరాధనకై

వెళ్ళుచున్నారు. మమ్ములను ముందుగా లేపెదనని మాట ఇచ్చిన పరిపూర్ణురాలా! లేచి వచ్చి మా కొరత తీర్పుము. సిగ్గులేనిదానా! మాట నేర్పుగలదానా! లెమ్ము! శంఖ చక్రములను ధరించిన విశాల బాహువులుగల పుండరీకాక్షుని కీర్తించుటకు రమ్ము!"

ఈ శరీరమే యొక తోట. చైతన్య ప్రసరణ మార్గమగు నాడీ మండలము వెన్నుపూసలో నుండును. ఇదియే దిగుడు బావి. తామర పూవులనగా నాడీ చక్రములు. మూలాధారము, స్వాధిష్ఠానము మణిపూరము అనాహతము, విశుద్ధము, ఆజ్ఞాచక్రము, సహస్రారము. కలువలనగా ఇంద్రియములు. ఇంద్రియములు ముడుచుకొనినవి.

ఇచట తోట యనగా 'అష్టాక్షరీ' మంత్రము. ఇందు మధ్యలో కల బావి 'నమః' అనునది. తామర పూవు అనగా పారతంత్ర్యము. కలువపూవు అనగా స్వాతంత్ర్యము. జేగురు రాయి అనగా విషయములందు రక్తికల మననం. విషయరాగవేం ఎర్రవు. భగవత్పారతంత్ర్యమును తెలియుటయే పొడిచేయుట.

భగవత్సంబంధము గల పదార్థములందు కలుపుట నీటిలో కలుపుట. ఇట్లు భగవత్పారతంత్ర్యము భగవత్ప్రీతి విభూతి యందు ప్రీతి గల మనసు గలిగి యుండుట కాషాయ వస్త్రధారణ.

తెల్లని పలువరుస ఆహారశుద్ధిని సూచించును. వాక్శుద్ధిని కూడా.

సన్న్యాసులనగా ప్రపన్నులు.

తనకు కలిగిన భగవదనుభవమును దాచుకొనక పరిపూర్ణముగా శిష్యుల కొసంగుటే సిగ్గులేకుండుట. భగవదను భవమున పరిపూర్ణత. శిష్యులకు మనోరంజకముగా బోధించ కలుగుటే మాటనేర్పు.

శంఖమనగా ప్రణవము! చక్రమనగా సుదర్శనము. భగవంతుని స్వరూపమును చక్కగా చూపునది.

కుంచె కోల యనగా ఆచార్య జ్ఞానముద్ర.

జ్ఞానముద్రయనగా చూపుడువ్రేలు బొటనవ్రేలుతో చేరియుండుట. మూడు వ్రేళ్ళు దూరముగా నుండుట. బొటనవ్రేలు భగవంతుడు. చూపుడువ్రేలు జీవుడు.

మూడువ్రేళ్ళు గుణత్రయము. గుణత్రయమునకు దూరమైననే జీవుడు భగవంతుని చేరును. ఇది జ్ఞానముద్రలోని సందేశము.

శంఖచక్రములను భుజములందు చిహ్నములుగా దాల్చిన ఆచార్యులే మనకు ఆశ్రయించదగినవారు.

ఈ పాశురమున తిరుప్పాణియాళ్వారులను మేల్కొలుపు చున్నారు.

'నంగాయ్' 'నాణాదాయ్' 'నావుడయామ్' అను సంబోధనలు వీరికి చక్కగా సరిపోవును. నంగాయ్ అనునది గుణపరిపూర్తివి తెలుపును. 'నాణాదాయ్' అనునది అహంకార రాహిత్యమును చెప్పుచున్నది. ఈ ఆళ్వారులు లోకసారంగ మహామునుల భుజములపై కూర్చొని ఆచార్యపురుషుల ఇండ్ల ముందునుండి సాగుచు అహంకారము ఏ మాత్రము లేకుండగా చేతులు జోడించుకొని 'అడియార్కెన్నై యాట్పడుత్త విమల' 'నీదాసులకు నన్ను దాసుని చేసిన 'విమలా!' అని సాధించుటచే వీరు 'నాణాదాయ్' గదా!

ఇక వీరు సాధించిన 'అమలనాదిపిరాన్' అను ప్రబంధమున పది పాశురములలో అఖిలవేద ప్రతిపాదిత గంభీరార్థములను సాధించియున్నారని వేదాంత దేశికలు ప్రస్తుతించి యున్నందున వీరు నాలుక గలవారే కావున 'నావుడయాయ్' అనునది సరిపోవును.

ఇక 'ఎంగళైమున్న ఎళుప్పువాన్' అనుదానిలో భాగవతులను మోసుకొనిపోవుట అను విలక్షణార్థము ధ్వనించు చున్నది కావున వీరికి సమన్వయమగును.

ఇక ఇచట గురుపరంపరా వాక్యమున

'శ్రీమన్నాథమునయే నమః' అని అనుసంధానము చేసుకొనవలయును. వీరు 'నావుడయాయ్' అనగా నాలుక బలము కలవారు. 'కణ్ణినుణ్ శిరుత్తాంబు'ను జపించి నమ్మాళ్వారులను ప్రసన్నులను చేసుకొని నాలాయిర దివ్య ప్రబంధమును పొంది దివ్యముగా గానము చేసి చేయించి లోకమున వ్యాపింపచేసిన మహానుభావులు కావున వీరు 'నావుడయాయ్' గదా!

**15.** ఎల్లే ఇళఙ్గి ళియే ఇన్నముఱఙ్గుదియో

శిల్లెన్ఱళై యేన్మిన్ నఙ్గైమీర్ పోదరుగిన్ఱేన్
వల్లె యున్ కట్టురైకళ్ పణ్డేయున్ వాయఱితుమ్
వల్లీర్ కళ్ నీఙ్గళే; నానేదానాయిడుగ
ఒల్లై నీపోదాయ్ ఉనక్కెన్న వేరుడైయ
ఎల్లారుమ్ పోన్దారో పోన్దార్ పోన్దెణ్ణిక్కొళ్
వల్లానైకొన్ఱానై మాత్తారై మాత్తళిక్క
వల్లానై, మాయనై ప్పాడేలో రెమ్బావాయ్.

లోనున్న గోపికకు బయటి గోపికలకు సంవాదము చెప్పబడినది.

బయటి గోపికలు :- ఓ లేత చిలుక వంటి తీయని గొంతు కలదానా! ఇంకను నిద్రించుచున్నావా!

లోని గోపిక :- పూర్ణులగు గోపికలారా! మనసున చిరాకు కలుగునట్లు పిలువవద్దు! నేను వచ్చుచున్నాను.

బ.గో :- నీవు చాల నేర్పు కలదానవు. నీ మాటల లోని చాతుర్యము మాకు ముందే తెలుసు.

లో.గో :- మీరే నేర్పు గలవారట. పోనీ నేనే కఠిను రాలను.

బ.గో :- నీకీ ప్రత్యేకత ఏమి? ఏకాంతమున ఎందుకుండెదవు? త్వరగా రమ్ము!

లో.గో :- అందరూ వచ్చిరా?

బ.గో :- వచ్చిరి. నీవు వచ్చి లెక్కించుకొనుము.

లో.గో :- సరి! నేను వచ్చి ఏమి చేయవలయును?

బ.గో :- బలిష్ఠమగు కువలయాపీడమను ఏనుగును చంపినవాడు, శత్రువుల దర్పమును అణచినవాడు మాయావి యగు శ్రీకృష్ణుని కీర్తిని గానము చేయుటకు రమ్ము.

ఇచట చిలుకయనగా భగవత్సారూప్యము నందిన ఆచార్యుడు గోచరించును. భాగవత గోష్ఠిలో, సేవలో భగవంతుని రాక కూడా అంతరాయంముగా భావించబడును. కావున చివుక్కుమనునట్లు పిలువకుడనిరి. ఆచార్య వాక్యమే శిష్యుల నుద్ధరించునది. నేనే పూర్ణురాలనని అంగీకరించుటచే భాగవతోత్తములు పలికిన దానికి చేతులు జోడించి శిరసు వంచి ఆమోదించుటే ధర్మమని బోధపడును. భాగవత గోష్ఠిని విడిచి ఒంటిగా

ఉండరాదు అని "నీ ప్రత్యేకత ఏమి" అను దానిచే సూచించబడినది. ఈ రెండే ఆచార్యప్రాప్తి హేతువులలో ముఖ్యమైనవి. ఏ ఒక్క భక్తుడు రాకున్ననూ కొరతయే అని 'అందరూ వచ్చిరా' అనుదానితో సూచించబడినది. 'వచ్చి లెక్కించు కొనుము' అను దానితో భాగవతోత్తముల దర్శనము స్పర్శనము సంభాషణము అవిచ్ఛిన్నముగా కొనసాగవలయునని కోరుట తెలియును.

కువలయాపీడము = భూమండలమును పీడించు అహంకారము

చాణూరముష్టికులు = కామక్రోధములు

ఈ పాశురమున తిరుమంగైయాళ్వారులను మేల్కొలుపు చున్నారు.

ఇందులో 'ఇళంకిళియే' అని చిలుకను సంబోధించిరి. చిలుక మనము పలికిన దానినే మరల పలుకును. వీరు కూడా నమ్మాళ్వారులు సాధించిన నాలుగు వేదముల సారమైన నాలుగు ప్రబంధములకు అరంగములన్నట్లుగా ఆరు ప్రబంధములలో నమ్మాళ్వారుల

శ్రీసూక్తులనే అనుసరించి అనుకరించి సాధించి యున్నారు. కావున వీరు చిలుకయే.

ఇట్లే 'ఉనక్కెన్న వేరుడయ' అని. అనగా వీరికున్న ప్రత్యేకత యేమనగా వీరు సాధించిన 'శిరియ తిరుమడల్' 'పెరియ తిరుమడల్' అను రెండు ప్రబంధముల వైలక్షణ్యమే వీరి వైలక్షణ్యము.

'ఎల్లారుం పోందారో' అనునది కూడా వీరి విషయమున సరిపోవును. వీరికి ముందే ఆళ్వారులందరు అవతరించి యుండిరి. కావున ఇచట తిరుమంగ యాళ్వారులు మేల్కొల్ప బడుచున్నారనుట పూర్వాచార్యుల సిద్ధాంతము.

ఇక చచటి గురుపరంపరా వాక్యము

'శ్రీమతే శఠకోపాయనమః' అమవది.

స్వామి 'తిరువాయ్ మొళి' ని నాకు సంత చెప్పి నాచే పలికించిరని వీరు చెప్పుకొనియున్నారు. కావున వీరు చిలుకయే కదా. ఆళ్వారులందరిలో వీరే చిన్నవయసు కలవారు కావున వీరు 'ఇళంకిళియే' కూడా. చిలుక

పలుకులు అతి మధురముగా నుండును. వీరి శ్రీ సూక్తులు అతి మధురతమములు కదా - ఇంకను వీరు 16 సంవత్సరముల వరకు నిద్రించి యుండిరి కావున 'ఇన్న మురంగిదియో!' అనునది కూడా వీరికి సరిపోవును. వీరు పరిపూర్ణులు కావున 'నంగైమీర్' అను సంబోధన కూడా వీరికి సరిపోవును.

16వ పాశురమున 'నాయక నాయ్' 'కోయిల్ కాప్పానే' 'తోరణవాశల్ కాప్పానే' అను సంబోధనలు శ్రీవిష్వక్సేనులకు సరిపడును. పరమపదమున కోవిలను కాపాడునది వీరే కావున 'శ్రీమతే విష్వక్సేనాయ నమః' అను వాక్యమును అనుసంధానము గావించుకొన వలయును.

18వ పాశురమున అమ్మవారి వైభవము చెప్పబడినది కావున 'శ్రియై నమః' అను వాక్యము బోధించబడును.

ఇక "ముప్పత్తు మూవర్" అను పాశురమున స్వామి వైభవము చెప్పబడినది కావున 'శ్రీధరాయ నమః'

అను వాక్యమును అనుసంధానము చేయవలయును. ఇట్లు ఈ ప్రబంధము అఖిల ఆళ్వారులను అనుసంధానము చేసి గురు పరంపరాను సంధానము చేయుచున్నదని తెలియవలయును.

**16.** **నాయగనాయ్ నిన్ఱనన్దగోపనుడైయ**
**కోయిల్ కాప్పానే! కొడిత్తోన్ఱుమ్ తోరణ**
**వాశల్ కాప్పానే! మణిక్కదవమ్ తాళ్ తిఱవాయ్,**
**ఆయర్ శిఱుమియరో ముక్కు ; అఱై పఱై**
**మాయన్ మణివణ్ణన్ నెన్నలే వాయ్‌నేర్‌న్దాన్;**
**తూయోమాయ్ వన్దోమ్, తుయలెళ పాడువాన్,**
**వాయాల్ మున్న మున్నమ్ మాత్తాదే, అమ్మా! నీ,**
**నేశ విలైక్కదవమ్ నీక్కేలో రెమ్బావాయ్.**

“నాయకుడైయున్న నందగోపుని భవన రక్షకా! జెండాతో ఒప్పుచున్న తోరణ ద్వారపాలకా! మణి కవాటపు గడియ తెరువుము. గొల్ల పడుచులమగు మాకు ధ్వని చేయు పరయను వాద్యము నిచ్చెదనని, మాయావి మణివర్ణుడగు శ్రీకృష్ణ పరమాత్మ నిన్ననే వాగ్దానము చేసెను. మేము పరిశుద్ధులమై వచ్చితిమి. మేలుకొలుపు

పాడవలయునని వచ్చితిమి. స్వామీ! నోటితో ముందు ముందుగ నిషేధింపకుము. ప్రేమ పూర్ణములగు ఈ తలుపులను నీవే తెరువుము" అని చెప్పుచున్నారు గోపికలు.

నందగోపుడనగా ఆచార్యుడు. ఆనందరూపుడగు భగవానుని అనర్హుల చేతిలో పడకుండగా కాపాడువాడు. నందగోపుని భవనమనగా మంత్రము. దానిలోని అకారము జెండా. నమశ్శబ్దార్థమును భావన చేయుట ద్వారమునకు తోరణము కట్టుట.

ఇచట తలుపులు ఆత్మస్వరూప జ్ఞానము, దాని వలన కలుగు స్వస్వాతంత్ర్యము. వీటిని ఆచార్యుడే తెరచి లోనికి పంపవలయును. గోపబాలికలనగా అనన్య గతిత్వము అజ్ఞానము కల శిష్యులు, పరయవగా కైంకర్యము.

పరిశుద్ధులనగా ఉపాయాంతరము, ప్రయోజనాంతరము లేనివారు. భగవద్ధ్యానమున నున్న ఆచార్యులను తమ కభిముఖులనుగా చేయుటయే నిద్ర మేల్కొలుపుట. ఆచార్యుని వాక్కే భగవంతుడు దయ

చూపుటకు ఆధారము.

17. అమ్బరమే; తణ్ణీరే; శోఱే; అఱమ్ శెయ్యుమ్
ఎమ్బెరుమాన్! నన్దగోపాలా! ఎழున్దిరాయ్;
కొమ్బనార్కెల్లామ్ కొழున్దే! కులవిళక్కే!
ఎమ్బెరుమాట్టి! యశోదాయ్! అఱివుఱాయ్;
అమ్బర మూడఱుత్తోఙ్గి యులగళన్ద
ఉమ్బర్కోమానే! ఉఱఙ్గాదె ழున్దిరాయ్!
శెమ్పొఱ్కழ లడిచ్చెల్వా! బలదేవా!
ఉమ్బియుమ్ నీయు ముఱఙ్గేలో రెమ్బావాయ్.

"వస్త్రములనే, చల్లని నీరునే, అన్నమునే ధర్మ బుద్ధితో దానమొసంగు నందగోపాలా! మా స్వామీ! మేల్కొనుము."

ప్రబ్బలి చెట్టువలె వంగిన శరీరము గల పడుతులలో చిగురువంటి మాకులమున మంగళదీపము వంటిదానా! మా స్వామినీ! యశోదా! మేల్కొనుము.

ఆకాశ మధ్యమును భేదించి పెరిగి తన పాదములతో లోకములను కొలచిన నిత్యసూరినాయకా!

నిద్రింపక మేల్కొనుము.

ఎఱ్ఱని బంగారు కడియమును పాదమునందు ధరించిన ఐశ్వర్యశాలీ! బలరామా! నీవును నీ తమ్ముడును మేల్కొనవలయును.

వస్త్రమనగా భగవన్ముఖ వికాసము నొసంగు శేషత్వము, పరబ్రహ్మము, పరమాకాశము.

నీరు - భోగ్యతా బుద్ధి లేకుండుట - పారతంత్ర్యము పొందవలయుననెడి శ్రద్ధ, విరజానదీ జలము

అన్నము - భగవత్కైంకర్యము, నిష్కృష్ట ఆత్మస్వరూప జ్ఞానము, బ్రహ్మానుభవము

నందగోపాలుడు - ఆచార్యుడు

యశోద - మంత్రము

మంత్రములలో విష్ణుషడక్షరి వాసుదేవ ద్వాదశాక్షరి అష్టాక్షరులు ముఖ్యములు. వాటిలో అష్టాక్షరి శ్రేష్ఠమైనది.

వామనుడు నారాయణ మంత్రార్థమును

వివరించెను.

సర్వశూన్య వాదులు అగు వేదబాహ్యులను నిరసించి సర్వజగద్వ్యాపకముగు భగవత్తత్త్వము కలదని తన అస్తిత్వమును అంతటా చూపినది వామనావతారము.

బలరాముని పాదమునకు తొడిగిన కడియము – భగవచ్ఛేషత్వము

కడియము గల బలరాముని పాదము – భాగవత శేషత్వము

**18.** **ఉన్దు మదకళిత్త నోడాద తోళ్ వలియన్**
**నన్దగోపాలన్ మరుమగళే! నప్పిన్నాయ్!**
**కన్దమ్ కమళుమ్ కుళలీ! కడై తిఱవాయ్;**
**వన్దెఙ్గుమ్ కోళియళైత్తనగాణ్; మాదవి**
**ప్పన్దల్ మేల్ పల్కాల్ కుయిలినఙ్గళ్ కూవినగాణ్;**
**పన్దార్ విరలి! ఉన్ మైత్తునన్ పేర్పాడ,**
**చ్చెన్దామరైక్కైయాల్ శీరార్ వళైయొలిప్ప**
**వన్దు తిఱవాయ్ మగిళ్న్దు ఏలో రెమ్బావాయ్.**

“మదమును స్రవించు ఏనుగుల బోలిన బలము

కలవాడు. వెనుదీయని భుజబలము కలవాడు అయిన నందగోపుని కోడలా! నప్పిన్నా! సువాసన గుబాళించుచున్న కొప్పు గలదానా! గడియ తీయుము. కోళ్ళు వచ్చి అంతటా కూయుచున్నవి. మాధవి పందిరిపై పలుసార్లు కోకిలల గుంపులు కూయుచున్నవి. బంతితో నిండిన వ్రేళ్ళు కలదానా! ఎర్ర తామరపూవు బోలిన చేతితో సౌందర్యభరితములగు గాజులు ధ్వనించగా వచ్చి నీ బావ యొక్క పేరును పాడుటకు సంతోషముతో తెరువుము."

నందగోపుడనగా = ఆచార్యుడు.

గజము = భగవానుడు

భగవానుని వశములో నుంచుకొనిన ఆచార్యులే ఏనుగులను వశీకరించుకొను నందగోపుడు. నందగోపుడు ఆచార్యుడు. అతని పల్లె ఆచార్య కులము. అదియే వ్రేపల్లె.

గడియ తీయుట అనగా అమ్మ కటాక్షించి కర్మాను గుణముగా కాక కృపాను గుణముగా మనను పరమాత్మ రక్షించునట్లు చేయుట.

కోళ్ళు అనగా భగవత్కైంకర్యము నందు శ్రద్ధగల భగవద్భక్తులు ఆచార్యులు.

కోకిలలు అనగా మధురగానము చేయు ఆళ్వారులు.

బంతి అనగా లీలా విభూతి

చేయి అనగా జ్ఞానము

సౌందర్యము - ఇతర విషయ నివృత్తి, సౌకుమార్యము స్వభోక్తృత్వ నివృత్తి

సౌగంధ్యము - నిరతిశయ ప్రేమ

చేతి గాజులు - అనన్యార్హ శేషత్వము, అనన్య శరణ్యత్వము, అనన్య భోగ్యత్వము

19. కుత్తువిళక్కెరియ క్కోట్టుక్కాల్ కట్టిల్‌మేల్
మెత్తెన్ఱ పఞ్చశయనత్తిన్ మేలేఱి,
కొత్తలర్ పూఙ్కుళల్ నప్పిన్నైకొఙ్గై మేల్
వైత్తుక్కి డన్దమలర్ మార్పా! వాయ్‌తిఱవాయ్
మైత్తడ ఙ్కణ్ణినాయ్! నీ యున్మణాళనై

**ఎత్తనైపోదుమ్ తుయిలెళ వొట్టాయ్‌కాణ్!**
**ఎత్తనై యేలుమ్ పిరివాత్తగిల్లాయాల్**
**తత్తువ మన్ఱు త్తకవే లో రెమ్బావాయ్.**

"గుత్తి దీపములు వెలుగుచుండగా దంతపు కోళ్ళుగల మంచముపై, మెత్తనైన అయిదు లక్షణములు గల పాన్పుపై నధిరోహించి, గుత్తులు గుత్తులుగా వికసించుచున్న పూవులు కేశములందు ధరించిన నీలాదేవి స్తనముల నానుకొని శయనించియున్న విశాలమైన వక్షః స్థలము గల ఓ దేవా! నోరు తెరువుము (అనగా) ఒకమాటను పలుకుము. కాటుకచే విశాలమగు కన్నులు గలదానా! నీ ప్రియుని ఒక క్షణమైనను నిద్రనుండి మేల్కొననీయవు కదా! నీవు ఒక్క క్షణమైనను స్వామి విరహమును ఓర్వలేనిచో అది నీ స్వరూపమునకు తగదు. స్వభావమునకు తగదు."

శ్రీమన్నారాయణ తత్త్వము నెరిగించు జ్ఞానమే దీపము.

దీని గుత్తులు – 1. శ్రుతి 2. స్మృతి 3. ఇతిహాసము 4. పురాణము 5. ఆగమములు

కులయాపీడ మనగా అహంకారము

దంతములు 4, 1. కర్తృత్వాహంకారము, 2. భోక్తృత్వాహంకారము, 3. జ్ఞాతృత్వాహంకారము, 4. శేషత్వాహంకారము.

పడకనున్న అయిదు లక్షణములు - అర్ధ పంచకము. కేశపాశము - వ్యామోహ జనకమగు శేషత్వము

పూలగుత్తులు - అహింసాది అష్ట పుష్పములు

స్తనములు - పరభక్తి పరమభక్తి

కన్ను - జ్ఞానము

కాటుక - భక్తి

**20.** ముప్పతు మూవర్ అమరర్కు మున్శెన్రు
కప్పమ్ తవిర్కుమ్ కలియే! తుయిలెళాయ్;
శెప్పముడైయాయ్! తిఱలుడై యాయ్! శెత్తార్కు
వెప్పఙ్గొడుక్కుమ్ విమలా! తుయిలెళాయ్;
శెప్పన్న మెన్ములైచ్చెవ్వాయ్ చ్చిఱు మరుఙ్గుల్
నప్పిన్నై నఙ్గాయ్! తిరువే! తుయిలెళాయ్;

**ఉక్కముమ్ తట్టొళియుమ్ తన్దున్ మణాళనై**
**ఇప్పోతే యెమ్మై నీరా ట్టేలో రెమ్బావాయ్.**

"ముప్పది మూడు కోట్ల దేవతలకు ముందుగా పోయి ముందు నిలిచి భయమును తొలగించు బలశాలీ! ఆర్జవము కలవాడా! పరాక్రమము కలవాడా! శత్రువులకు భయ జ్వరమును గలిగింపజాలిన నిర్మలా! నిద్రవీడుము."

స్వర్ణకలశములను బోలిన మృదువైన స్తనములు, ఎఱ్ఱని దొండపండువంటి పెదవి సన్నని నడుము కలిగిన ఓ నీలాదేవీ! శ్రీరూపిణీ! మేల్కొనుము.

విసనకఱ్ఱను, అద్దమును ఇచ్చి నీ ప్రియునితో మేము స్నానము చేయునట్లు చేయుము.

| | | |
|---|---|---|
| ఆర్జవము | – | అవిద్య |
| బలము | – | జగద్భరణము |
| స్తనములు | – | పరభక్తి, పరమభక్తి |
| అధరము | – | పరమాత్మయందు రక్తి |
| నడుము | – | విరక్తి |

విసనకఱ్ర - నమః అను పదము

అర్ధము - ఓం

స్నానము - పరమాత్మకు సర్వవిధ కైంక ర్యములను చేయుట

**21.** **ఏత్తకలఙ్గళ్ ఎదిర్ పొఙ్గి మీదళిప్ప**
**మాత్తాదే పాల్ శొరియుమ్ వళ్లల్ పెరుమ్ పశుక్కళ్**
**ఆత్తప్పడైత్తాన్ మగనే! యఱివుఱాయ్;**
**ఊత్తముడైయాయ్! పెరియాయ్! ఉలగినిల్**
**తోత్తమాయ్ నిన్ఱశుడరే! తుయిలెళాయ్;**
**మాత్తారునక్కు వలితులైన్దు ఉన్ వాశఱ్కణ్**
**ఆత్తాదు వన్దు ఉన్నడి పణియు మాపోలే**
**పోత్తియామ్ వన్దోమ్ పుగళ్న్దు ఏలోరెమ్బావాయ్.**

"పొదుగు క్రింద పెట్టిన కుండలు పైపైకి పొంగి పొరలునట్లు నిండునట్లుగ పాలను ఎడతెగకుండగా స్రవించు ఉదారములగు పెద్దయావులు సమృద్ధిగా కలిగిన నందగోపుని కుమారుడా! మేలుకొమ్ము! దృఢప్రమాణ సిద్ధుడా! నిరతిశయ బృహత్త్వము కలవాడా! లోకమున

ఆవిర్భవించి ప్రకాశించు జ్యోతి స్వరూపా! నిద్రనుండి లెమ్ము! శత్రువులు నీ యొక్క బలమునకు లొంగి ఆగలేక నీ వాకిలికి వచ్చి నీ పాదములను స్తుతించునట్లే మేము కూడా ఆగలేక పొగడి మీకు మంగళా శాసనము చేయ వచ్చినాము."

నందగోపుదు ఆచార్యుదు. గోవులు వేదములు. వేదాంగములు దూడలు. మన కోరికలను తీర్చుట కుండలను నింపుట.

గోవులు - ఆచార్యులు, కుండలు - శిష్యులు

ఆచార్యుని ఆశ్రయించుట కుండను పొదుగు క్రిందపెట్టుట.

ఆచార్యోపదేశములను శిష్యులు మననము చేసి యుక్తులను గూర్చి దృఢము చేయుటే పొంగు.

శత్రువులు - భక్తులను ద్వేషించువారు.

**22.** అఙ్గణ్ మాఞాలత్తరశర్, అబిమాన
బఙ్గమాయ్ వన్దు నిన్ పళ్లికట్టిల్ కీళే

శజ్గమిరుప్పార్ పోల్ వన్దు తలై ప్పెయ్‌దోమ్
కిజ్గిణివాయ్ చ్చెయ్‌ద తామరై ప్పూప్పోలే
శెజ్గణ్ శిఱిచ్చిఱిదే యెమ్మేల్ విళియావో;
తిజ్గళు మాదిత్తియను మెళున్దాల్పోల్
అజ్గణిరణ్డు జ్గొణ్డు ఎజ్గళ్‌మేల్ నోక్కుదియేల్
ఎజ్గళ్‌మేల్ చాబ మిళిన్దేలో రెమ్బావాయ్.

“సుందరము విశాలమగు పృధివిని పాలించిన రాజులు అహంకార శూన్యులై వచ్చి, నీవు శయనించు మంచము క్రింద గుంపులు గుంపులుగా రాజులు చేరినట్లు వచ్చి చేరితిమి. చిరుగంట ముఖమువలె సగము విడి సగము విడకయున్న తామరపూవువలె, నీ ఎర్రని నేత్రములను కొంచెము కొంచెముగా విప్పి మాపై ప్రసరింపజేయవా!

ఆకాశ మధ్యమున సూర్యచంద్రు లుదయించు నట్లు నీ సుందరములగు నేత్రములను రెండింటిని మాపై పరచి చూచితివా! తప్పక అనుభవించవలసిన నీ వియోగముచే కలుగు కష్టము తీరి ఆనందము కలుగును.”

అభిమాన భంగము - దేహాత్మాభిమానము తొలగుట

అనన్యార్హ శేషత్వము అనన్య శరణ్యత్వ జ్ఞానము కలుగుట, ఆరు భ్రాంతులు తొలగుట

1. దేహమే ఆత్మ 2. నేను స్వతంత్రుడను
3. నా రక్షణను నేను చేసుకొనగలను
4. నేను ఇతరులకు శేషభూతుడను
5. ఆభాస బంధువులందు బంధుత్వ బుద్ధి
6. విషయములందు భోగ్య బుద్ధి

ఈ ఆరు భ్రాంతులు తొలగుట

ఈ అభిమానములు తొలగిననాడే స్వామిని చేరును.

ఆచార్య కటాక్షము కూడా ఒకేసారి కాక క్రమముగా ప్రసరించును.

పరమాత్మ కటాక్షము ప్రసరించిన ప్రారబ్దము కూడా నశించును.

ఈ క్రమ కటాక్షము అరు అభిమానములను ఒకదాని వెంట ఒకటి తొలగించును.

23\. మారి మలై ముళఙ్జిల్ మన్ని క్కిడన్దుఱఙ్గుమ్
శీరియ శిఙ్గ మఱివిత్తు త్తీ విళిత్తు
వేరి మయిర్ పొఙ్గ వెప్పాడుమ్ పేర్న్దు దఱి
మూరి నిమిర్న్దు ముళఙ్గి ప్పుఱప్పట్టు
పోదరు మాపోలే; నీ పూవై ప్పూవణ్ణా! ఉన్
కోయిల్ నిన్ఱిఙ్గనే పోన్దరుళి, కోప్పుడైయ
శీరియ శిఙ్గాసనత్తిరున్దు, యామ్ వన్ద
కారియమారాయ్ న్దరుళే లో రెమ్బావాయ్.

"వర్షాకాలమునందు పర్వత గుహలలో ఆడ సింహమును తానును ఒక్కటే వస్తువు అనునట్లు కలిసిపోయి పడకపై నిద్రించుచున్న పరాక్రమము యొక్క అతిశయముతో కూడియున్న సింహము మేల్కొంచి తన శత్రుమృగములపై కోపముతో నిప్పు కణములు రాలునట్లు కన్నులను తెరచి చూచుచు, పరిమళించు చున్న మెడపై జూలు నిక్కపొడుచుకొనగా, నాలుగు వైపులకును కదిలి

శరీరము నొక్కసారి దులుపుకొని, బాగుగా ఆపాద మస్తకము సాగి గట్టిగా గర్జించి, గుహనుండి బయటకు వచ్చునట్లుగా, ఓ కృష్ణా! అతసీ పుష్పమువలె నల్లనైన శరీరము గల నీవు నీ ప్రాసాదము నుండి యిచ్చటికి వేంచేసి, జయశీలయై సంకల్పించిన పనిని నెరవేర్చి యిచ్చు వైలక్షణ్యముగల సింహాసనము నందు వేంచేసి యుండి, మేము తలబెట్టి వచ్చిన పనిని విచారించి కృప చేయవలయును."

ఇచట వర్షమనగా భగవత్కృపా సముద్రము నుండి కారుణ్యమనెడు వాయువుచే కదలబడిన నీటి కెరటముల నుండి బయలువెడలిన భగవత్కటాక్ష ప్రసరణము.

ఇచట గుహయనగా వేదగుహ. ఇచట నున్న 'శీరియ సింగ' మనగా లక్ష్మీసహిత నారాయణుడు. దీని భావమే "ధర్మస్య తత్త్వం నిహితం గుహాయాం" అను శ్రుతిచే చెప్పబడినది.

సింహము తెలివి తెచ్చుకొనుట అనగా చేతనులను వారి వారి కర్మానుగుణముగా శరీరములను సృజించి

అందు చేర్చుటకు తగిన సమయము వచ్చినదని గుర్తించుట. ఇదియే కారణతత్త్వములోని మొదటి స్పందనము. ఇదియే మేల్కొనుట ఆశ్రిత రక్షణావసరమును గుర్తించుట.

చూచుట యనగా సృష్టికి సంకల్పించుట.

'ఐక్షత బహుస్యాం ప్రజాయేయ' అనునది శ్రుతి వాక్యము. ఇట్లు సంకల్పించగనే మొదట తేజస్సు దానినుండి జలము పృథివి ఆవిర్భవించును. ఈ క్రమమునే "తీవిళిత్తు, వేరిమయిర్ పొంగ" అని చెప్పబడినది. సృష్టి క్రమ వికాసమే "ఎప్పాడుం పేరిందుదరి, మూరినిమిరిన్దు" అను వాటితో చెప్పబడినది. పరతత్త్వము కారణావస్థను వదిలి కార్యావస్థను అనగా జగద్రూపము నందునపుడు ప్రకృతి రూపుగాంచిన పరమాత్మ శరీరములో కలిగెడి మార్పులను "ముళంగి పురప్పట్టు పోదరుమాపోలే" అనుదానిచే చెప్పబడినది.

కార్యావస్థ నొందిన పరమాత్మలోని సౌలభ్యమే 'అతసీ పుష్ప సచ్ఛాయ'

ఇచట కోయిల్ అనగా ప్రణవము

ఇదియే పరమాత్మకు, జీవాత్మయగు ఆచార్యునకు నివాసము కదా!

విభూతి పరమాత్మ సింహాసనము

24. అన్ఱి వ్వులగ మళన్దాయ్! అడిపోత్తి;
చ్చెన్ఱఙ్గు త్తెన్నిలజ్గై శెత్తాయ్! తిఱల్ పోత్తి;
పొన్ఱ చ్చగడ ముదైత్తాయ్; పుగళ్‌పోత్తి;
కన్ఱు కుణిలా వుఱిన్దాయ్! కళల్‌పోత్తి;
కున్ఱుకుడై యావెడుత్తాయ్! గుణమ్ పోత్తి;
వెన్ఱు పగై కెడుక్కుమ్ నిన్‌కై యిల్ వేల్ పోత్తి;
ఎన్ఱెన్ఱున్ శేవగమే యేత్తిప్పఱై కొళ్వాన్
ఇన్ఱి యామ్ వన్దోమ్ ఇరఙ్గేలో రెమ్బావాయ్.

"ఆనాడు బలిచక్రవర్తి తనది కాని రాజ్యమును తాను ఆక్రమించి దేవతలను బంధించగా ఈ త్రైలోక్య రాజ్యమును బలినుండి దానముగా గ్రహించి పాదములతో కొలిచిన మీ దివ్యపాదార విందములకు మంగళము.

రావణాసురుడు సీత నపహరించగా రావణుని

నివాసమగు లంకకేగి సుందర భవనములు, కోటలు గలది, దక్షిణదిశ యందునున్న లంకానగరమును ధ్వంసము చేసి అచటి రాక్షసులను సంహరించిన మీ బాహుబలమునకు, మంగళము.

శ్రీ బాలగోపాలుని రక్షణకై యుంచిన బండిలో ఆవేశించిన రాక్షసుని వధించుటకు ఆ బండికి తాకునట్లుగా కాలు చాచి నేలకూల్చిన మీ అసమాన కీర్తికి మంగళము.

దూడ రూపముతో వచ్చియున్న రాక్షసుడు దారిలో నున్న కపిత్థాసురుడు (వెలగచెట్టు) నీకు కీడు చేయ సంకల్పించి రాగా దానిని తెలిసిన నీవు వత్సాసురుని ఒడిసెలరాయి విసిరినట్లుగా వెలగచెట్టు పైకి విసిరినపుడు ముందు వెనుకలకు వంచి ఉంచిన మీ దివ్యపాదములకు మంగళము.

ఇంద్రుడు తన యాగమును భంగ పరిచినందుకు కోపించి రాళ్ళ వాన కురియగా గోపాలురను గోవులను కాపాడుటకు గోవర్ధన పర్వతమును గొడుగుగా నెత్తిన మీ వాత్సల్యమునకు మంగళము.

శత్రువులను సమూలముగా నశింపచేసి విజయమును తెచ్చిపెట్టు నీ చేతిలోని వేలాయుధమునకు మంగళము. ఇట్లు నీ పలు వీరచరితములను నోరారా స్తుతించి మా నోమునకు కావలసిన పర గైకొనుటకు ఈనాడు వచ్చియున్నాను. మమ్ము అనుగ్రహించుము."

ఈ పాశురము 'మంగళాశాసన పాశుర' మని ప్రసిద్ధి. గోపికలు కోరినట్లుగానే శ్రీకృష్ణభగవానుడు శయ్యామందిరము నుండి సభా మందిరమునకు నడిచి వచ్చి సింహాసనమున కూర్చొనెను. అపుడు ఎర్రబారి కందిన అతని పాదములను చూచిన గోపికల హృదయము కలత చెందినది. ఆ స్వామికి క్షేమము, శుభము కలుగవలయునని మంగళము పాడుచున్నారీ పాశురమున. అమంగళములు తొలగి మంగళములు కలుగ వలయునని కోరుటను మంగళాశాసనమందురు.

ఇది చూచుటకు ఇతరులకు పిచ్చి పనివలె కనిపించును. కాని విశిష్టాద్వైత సిద్ధాంతమున ఇది అత్యంత ముఖ్య కార్యము. ఆచార్యులు శిష్యులను

స్వీకరించుట భగవన్మంగళా శాసనపరుల అభివృద్ధి కొరకే అని 'శ్రీవచన భూషణము' న నిశ్చయింప బడినది. ఈ మంగళాశాసన కైంకర్యము భక్తులకు ప్రపన్నులకు తప్ప ఇతరులకు తెలియరాని పరమ రహస్యము.

చేతనునకు రెండు దశలుండును. జ్ఞానదశ ప్రేమ దశ యని. జ్ఞానదశలో అతని రక్షణను కోరెదము. ప్రేమదశలో అతనికి మనమే రక్షకులమని భావింతుము. ఈ ప్రేమ దశలో చేయునదే మంగళాశాసనము.

'ఉపదేశరత్నమాల' లో వరవరమునులు

'మంగళాశాసనత్తిన్ మత్తుళ్ళ ఆళ్వార్ కల్'

అను పాశరము శ్రియఃపతికి మంగళాశాసనము చేసినందున ఇతరాళ్వారుల కంటే శ్రీ విష్ణుచిత్తులకు పెరియాళ్వారుగా పేరొచ్చెను అని సాధించిరి. ఈ నియమాను సారముగానే లక్ష్మణుని 'ఇళై పెరుమాళ్' అని గుహుని 'గుహపెరుమాళ్' అని వ్యవహరించు చున్నారు.

శ్రీమద్రామాయణమున బాలకాండలో దశరథుడు,

జనకుడు, విశ్వామిత్రుడు, అయోధ్యావాసులు, కౌసల్యాదేవి, అయోధ్యాకాండలో - సీతాపిరాట్టి, అరణ్యకాండలో ఋషులు - జటాయువు, కిష్కింధ కాండలో - ఆంజనేయులు, శ్రీవిష్ణుపురాణమున నందగోపుడు, వసుదేవుడు, దేవకి, శ్రీమన్మహాభారతమున - విదురుడు, ధర్మరాజు, భీష్ముడు.

ఇట్లే ఇతరత్రా ధనర్దాసు మొదలగువారు మంగళా శాసనమును గావించియున్నారు.

ఇచట 'బలి' యనగా అహంకారము. అహంకార మమకారములు ప్రకృతికి కవల పిల్లలు. తల్లి సొత్తగు ప్రపంచమును ఆక్రమించి తమదేయని గర్వించు చుందురు. వాస్తవముగా ఇదంతయూ పరమాత్మది. ఇట్టి అహంకారమును తొలగించునది శ్రీపాదరేణువే. ఇదియే మొదటి పాదమునకు అంతరార్థము. అనగా శ్రీపాదసుధను గోలిన భక్తులకు అహంకార మమకారములుండవు.

కేవల అహంకారమును తొలగించిన చాలదు. అహంకారమునకు పుట్టిల్లగు ప్రకృతి కూడా తొలగిపోవలె.

అదియు రెండవ పాదములో చెప్పబడుచున్నది.

ఇచట లంకయనగా శరీరము. ఆ శరీరములోని మనస్సే రావణుడు. ఆ రావణుని పది తలలే పది ఇంద్రియములు. పరమాత్మ మన శరీరమునందు అంతర్యామియై, అహంకారము పుట్టు మనమును విషయ భోగములకు పనికి రాకుండగా పాడుచేసి, ఆ మనసును పాలించు రాజసమను రావణుని చంపి సాత్త్వికమను విభీషణుని పిలిపి తనను కొలుచునట్లు చేయుటే లంకా వృత్తాంతము.

దేహాత్మ వివేకము లేనపుడే అహంకార ముదయించును. అవిద్యా సంబంధము వలననే మనకు అవివేకము కలుగును. అనగా వివేకము తొలగును. అవిద్యా సంబంధముచే కర్మ కలుగును. ఆ కర్మను నశింపచేయుటయే శకటాసుర వృత్తాంతము.

'బండి' మనను ఒకచోట నుండి ఇంకొక చోటికి చేర్చును. ఆత్మను ఒక శరీరము నుండి వేరొక శరీరమునకు చేర్చునది కర్మయే కదా. దీని రెండు

చక్రములు ఉత్తర పూర్వాఘములు. 'శం కటయతి' అనగా సుఖమును నశింపచేయునది అని అర్థము.

ఈ కర్మ భగవత్పాదస్పర్శతోనే తొలగును.

అహంకారము, కర్మ నశించిననూ రుచి వాసనలు నశించవు. లోపల రుచి వాసన రూపముగా నుండి సమయమునకు బయటపడును.

ఇచట రుచి - వత్సాసురుడు - దూడ ప్రతి దానిని రుచి చూచుచుండును.

వాసన - కపిత్థాసురుడు - కపిత్థమనగా వెలగపండు, వెలగపండు వాసన సుప్రసిద్ధమే కదా. మొదట రుచి, తరువాత వాసన నశించవలయును. అనగా రుచితో వాసన తొలగ వలయును. వత్సాసురునితో కపిత్థాసురుని సంహరించుటలోని అంతర్యము ఇదే.

ఇక గోవర్ధనము నెత్తుటలోని అంతర్యము చూతము. దేవేంద్రుడు కురిపించిన రాళ్ళవాన అనగా విషయ వ్యామోహము. ఒక్కొక్క రాయి ఒక్కొక్క ప్రాణిని చంపును. ఒక్కొక్క విషయము ఒక్కొక్కని నశింప చేయును.

విషయ వ్యామోహము నశింపచేయకుండ వలయుననగా గోవర్ధన మెత్తవలయును. గోవర్ధన మెత్తుట యనగా, గోవు అనగా వాక్కు, వర్ధనమనగా పెంచుట, వాక్కును పెంచుట యనగా, 'రాముడను నేను' 'కృష్ణుడను నేను' అనెడి భావము తొలగి ప్రతి పదము శరీరము వరకు మాత్రమే కాక ఆత్మ వరకు వెళ్ళవలయును. అటనుండి పరమాత్మ వరకు వెళ్ళవలయును. అనగా ప్రతివస్తువు నందు ప్రకృతి 'జీవుడు' పరమాత్మ యుందురు. రాముడు అనగా రామరూప శరీరముతో చేరియున్న ఆత్మ కంతర్యామి యైన పరమాత్మ అని అర్థము. ఇట్లు వాక్కునకు అర్థమును పరమాత్మ వరకు తెలుపుటయే గోవర్ధన మెత్తుట. ఇట్లు పరమాత్మ వరకు తెలిసిననాడు విషయ వ్యామోహము తనకు తానుగానే నశించును. అనగా హాని చేయజాలదు. ఇదియే గోవర్ధన వృత్తాంతము.

శ్రీకృష్ణుడు భగవానునిగానే కాక ఆచార్యునిగా కూడా ఉపదేశము చేసెను కదా! కావున శ్రీకృష్ణుని చేతిలోని వేలాయుధము ఆచార్యుని ఉపదేశముద్ర. ఈ ఉపదేశము సర్వము పరమాత్మాత్మకముగా బోధించును.

కాన శత్రుత్వ భావన ఎటులుండును. శత్రుత్వ భావన తొలగుటయే శత్రునాశము అని అర్థము.

ఈ పాశురమున 'పోత్తి' అని ఆరుమార్లు చెప్పిరి. భోజనమున షడ్రసములు ఆనందము నిచ్చునట్లు ఇచట ఆరు మారులు స్తుతించిన ఆనందము కలుగును. ఆరు రుచులున్నట్లే మనకు అరిషడ్వర్గమున్నది. ఒక్కొక్కటి తొలగుటకు ఒక్కొక్క పోత్తి అని తెలియవలయును. శత్రునిర్మూలనమే అంతరార్థమని తెలుపుటకే చివరికి శత్రువుల విషయము నుదహరించిరని తెలియవలయును.

25. ఒరుత్తి మగనాయ్ పిఱన్దు, ఓరిరవిల్
ఒరుత్తి మగనాయ్ ఒళిత్తు వళర,
తరిక్కిలానాగి త్తాన్ తీఙ్గు నినైన్ద
కరుత్తై ప్పిళైప్పిత్తు కఞ్జన్ వయిత్తిల్
నెరుప్పెన్న నిన్ఱ నెడు మాలే! యున్నై
అరుత్తిత్తు వన్దోమ్; పఱై తరుతియాకిల్,
తిరుత్తక్క శెల్వముమ్ శేవకముమ్ యామ్పాడి
వరుత్తముమ్ తీర్న్దు మగిళ్న్దేలో రెమ్బావాయ్.

"శ్రీకృష్ణా! భగవానుడే తనకు కుమారునిగా కావలయునని కోరి, శంఖచక్రగదాధారిగా భగవానునే కుమారునిగా పొందగలిగిన సాటిలేని తల్లి దేవకికి కుమారుడవై జన్మించి, శ్రీకృష్ణుని లీలలను పరిపూర్ణముగా అనుభవించి కట్టను కొట్టను భగవానుని వశమొనర్చుకొనిన, అద్వితీయ వైభవము కల యశోదకు ఆ రాత్రియే కుమారుడవై దాగి పెరిగినవాడా! ఈ వృత్తాంతమును నారదుని వలన విని కంసుడు రాబోవు ననర్థము నెరుంగక సహించలేనివాడై ఏదో విధముగా నిన్ను చంపవలయునని చెడు భావముతో నున్న కంసుని అభిప్రాయమును వ్యర్థ పుచ్చి, వాని కడుపులో చిచ్చుగా నిలిచి, నిన్ను చంపవలెనన్న వానిని నీవే చంపిన ఆశ్రిత వ్యామోహశాలీ! నిన్నే కోరి వచ్చితిమి. మా సంకల్పము నెరవేర్చదలచినచో శ్రీలక్ష్మీదేవి యాశపడదగిన సంపదను, ఆ సంపదను సార్థక పరచగల నీ పరాక్రమమును ఆనంద పరవశులమై పాడి, అలసట తీరి ఆనందించు నట్లు అనుగ్రహించుము."

శ్రీకృష్ణునకు ఇద్దరు తల్లులుండునట్లు మనకు కూడా ప్రధానమగు మంత్రములు రెండు. 'నారాయణాష్టాక్షరి' 'వాసుదేవ ద్వాదశాక్షరి.' ఇందు నారాయణష్టాకరిలో నారాయణ తత్త్వము స్పష్టముగా ప్రకాశించును. వాసుదేవ శబ్దములో సర్వ వ్యాపకత్వము గూఢముగా నున్నది. కావున దేవకి అనగా నారాయణాష్టాక్షరి. యశోద అనగా వాసుదేవ ద్వాదశాక్షరి.

ఒకటి గాయంత్రి మంత్రము. ఇంకొకటి నారాయణాష్టాక్షరి అని కూడా మతము కలదు. అపుడు గాయత్రిలో అనగా సూర్యమండలమున శ్రీమన్నారాయణుడు శంఖచక్రధారియై ప్రత్యక్షముగా కనపడును కాన దేవకీదేవి గాయత్రీ మంత్రమని, నారాయణ శబ్దములో 'నార' 'అయన' శబ్దార్థములు తెలిసినవే బోధపడును. కాన నారాయణాష్టాక్షరి యశోదయని తెలియ వలయును.

ఇచట కంసుడనగా అహంకారము. అహంకారము తనకంటే ఇంకొక పరమాత్మ యున్నాడని విని సహించ లేదు. అంతేకాదు శరీరము కంటే విడిగా ఆత్మ ఉన్నదని కూడా అంగీకరించని దేహాత్మాభిమానమే అహంకారము.

ఈ అహంకారమును భగవంతుడే పోగొట్టవలయును. దానిలో తాను చేరును అది కూడా అగ్నివలె. అనగా అహం ధ్వంసమై దాసోహం అగుమ. ఇదియే నిప్పులా నిలుచుట.

**26. మాలే! మణివణ్ణా! మార్గళి నీరాడువాన్;**
**మేలైయార్ శెయ్వనగళ్; వేణ్డువన కేట్టియేల్;**
**ఞాలత్తై యెల్లామ్ నడుఙ్గ మురల్వన**
**పాలన్న వణ్ణత్తు ఉన్ పాఞ్జశన్నియమే**
**పోల్వన శఙ్గఙ్గళ్, పోయ్ప్పాడు డైయనవే,**
**శాలప్పెరుమ్ పఱైయే, పల్లాణ్డిశైప్పారే,**
**కోలవిళక్కే, కొడియే, వితానమే,**
**ఆలినిలై యాయ్! అరుళేలో రెమ్బావాయ్.**

"ఆశ్రిత వ్యామోహము కలవాడా! ఇంద్రనీలమణిని పోలిన కాంతి స్వభావము కలవాడా! చిన్న మర్రి యాకుపై పరుండి, అఘటిత ఘటనా సామర్థ్యము కలవాడా! మేము మార్గశీర్ష స్నానమును చేయగోరి ఆ వ్రతమునకు కావలసిన పరికరములను కోరి వచ్చితిమి. ఈ వ్రతమును

పూర్వులు ఆచరించి యున్నారు. నీవు విన్నచో కావలసిన పరికరములను తెలిపెదము.

ఈ భూమండలమంతయు వణుకునట్లు శబ్దము చేయు పాలవలె తెల్లనైన నీ పాంచజన్య శంఖమును బోలిన శంఖములు కావలయును. విశాలమగు చాలా పెద్ద పర కావలయును. మంగళ గానము చేయు భాగవతులు కావలయును. మంగళ దీపములు కావలయును. ధ్వజములు కావలయును. మేలుకట్లు కావలయును. దయచేసి ప్రసాదింపుము."

శ్రీకృష్ణునకు మణికి పోలిక చెప్పబడినది.

మణి ఉన్నవారు ఉన్నవారు. మణి లేనివారు లేనివారుగ పరిగణింతురు. భగవంతుడు కలవాడనువారు ఉన్నవారు. భగవంతుడు లేడనువారు లేనివారుగా నుందురు. మణి ఉన్నవారిని అందరూ గౌరవింతురు. భగవంతుని భక్తునికి అందరూ దాసోహమందురు. గొప్ప వారు ధరింతురు. చిన్నవారు అమ్ముకొని బ్రతుకుదురు. భగవంతుని అనుభవించి ఆనందించు వారు భగవంతుని

నలుగురికి తెలిపి ధనము సంపాదించు వారుందురు.

ఇచట స్నానమనగా భగవద్గుణాశ్లేషమే అని తెలియ వలయును. ఇదియూ ప్రపన్నులు ఆచరించు కైంకర్యముగా తెలియవలయును. అనగా కర్మలను త్యజించక ఫలసంగ కర్తృత్వ త్యాగపూర్వకముగా ఆచరించుటే ఈ స్నానము అని అభిప్రాయము.

శిష్టాచారానుసరణముగా అనగా భగవద్భాగవతా చార్యాజ్ఞానుసరణమును సూచించును.

ఇచట శంఖమనగా ప్రణవము. ప్రణవము భగవచ్ఛే షత్వమును బోధించును. కైంకర్యము లేనిదే శేషత్వము నిలువదు. కావున ప్రణవ శబ్దమునకు కైంకర్యము అర్థము. ఆ కైంకర్యములు పలు విధములుగా నుండుటే పలు శంఖములు అడుగుటలో ఓ తాత్పర్యము.

ఇక చాలా పెద్ద పర అనగా అష్టాక్షరిలోని 'నమః' పదము. ఇచట పెద్ద చాలాపెద్ద యనుటలో పరిణామము కాక అర్థ బోధనలో పెద్దతనము. ఇచట ప్రణవము కన్ననూ నారాయణ పదము కన్నను చాలా అర్థమేను

బోధించుచున్నది. స్వరూపములోని పురుషార్థములోని దోషమును పోగొట్టునది నమఃపదమే. కావున చాలాపెద్ద పర యనగా నమఃపదమని తెలియువలయును. కైంకర్యములోని ఆనందము శ్రియఃపతికే కాని తనకు కాదని బోధించి వాని దోషమును తొలగించును. పండులోని గుణములు భోక్తకు ఆనందము నిచ్చును కాని పండుకు ఈయజాలవు కదా. నమః పదము ఇటు ప్రణవము లోను అటు నారాయణ పదములోను అన్వయించునది కావున చాలా పెద్దది అని అభిప్రాయము.

'ఇక పల్లాండి శైప్పారే' అనగా మంగళమును పాడువారు. అనగా పరమ భాగవతోత్తముల్తో సహవాసము. అనగా సత్సంగతి. సత్సాంగత్యమే పురుషార్థ సీమను చేర్చునది. పరమాత్మను సేవించువారికి కార్యసిద్ధి కలుగకపోవచ్చును కానీ భక్తులను సేవించు వారికి తప్పక కార్యసిద్ధి కలుగును.

'కోలవిలక్కే' అందమైన మంగళదీపము. ఇతర పదార్థముల యధార్థ స్వరూపమును ప్రకాశింప చేయునది

దీపము. జీవుని భగవచ్ఛేషత్వము మంగళ దీపము. దీని సౌందర్యమనగా భాగవతశేషత్వ జ్ఞానమని తెలియజేయుటే. ఈ భాగవత శేషత్వము శ్రీవైష్ణవ సర్వస్వమగు అష్టాక్షరీ మంత్రములోని ప్రణవ నమః నారాయణ పదములతో తెలియజేయు అత్యంత రహస్య సర్వస్వముగా పేర్కొనవచ్చును.

ఇక 'కొడియే' అనగా ధ్వజము. ధ్వజము అనగా సూచకము కదా. శేషత్వమునకు సూచకము కైంకర్యము. కావున ధ్వజమనగా కైంకర్యమని భావము. ఈ కైంకర్యము ప్రార్థించిననే లభించును. శ్రియఃపతి అంగీకరించినపుడే ఇది పురుషార్థ మగును.

ఇక 'వితానము' అనగా చాందినీ. అనగా దారిలో నడుచువారికి పైనుండి మంచు మొదలగునవి వడకుండా రక్షగా నుండునది.

'కొడి' యనగా కైంకర్యమనినాము కదా. కైంకర్యము వలన కలుగు ఆనందము తనది అను బుద్ధి యుండరాదు. అనగా భోక్తృత్వబుద్ధి నివృత్తి. ఇదియే

వితానము.

ఇట్లు అనన్యార్హ శేషత్వజ్ఞానము, పారతంత్ర్య జ్ఞానము, భాగవత సహవాసము, భాగవత శేషత్వ జ్ఞానము భగవత్కైంక ర్యము, కైంకర్యమున భోక్తృత్వబుద్ధి నివృత్తి కావలయును అని కోరిరని అభిప్రాయము.

**27.** కూడారై వెల్లుమ్ శీర్ గోవిన్దా! ఉన్దన్నై
ప్పాడి ప్పఱైకొణ్డు యామ్ పెఱు శమ్మానమ్,
నాడు పుగళుమ్ పరిశినాల్ నన్ఱాక
చ్చూడగమే, తోళ్వళైయే, తోడే, శెవిప్పూవే,
పాడగమే, యెన్ఱనైయ పల్కలనుమ్ యామణివోమ్,
ఆడై యుడుప్పోమ్; అదన్పిన్నే పాల్శోఱు
మూడ నెయ్ పెయ్దు ముళఙ్గై వళివార
క్కూడి యిరున్దు కుళిర్న్దేలో రెమ్పావాయ్.

"నిన్నాశ్రయించని వారిని జయించు స్వభావము కల శ్రీకృష్ణా! నిన్ను స్తుతించి వ్రతసాధనమగు పఱయను వాద్యమును పొంది తరువాత పొందు సన్మానము లోకులు పొగడునట్లు ఉండవలయును. చేతులకు గాజులు

మొదలగునవి, బాహువులకు దండకడియములు, చెవులకు క్రింది భాగమున దాల్చెడి దిద్దులు, పై భాగమున దాల్చెడి చెవిపూలు, కాలియందెలు మొదలగు అనేకాభరణములను దాల్చవలయును. తరువాత మంచి వస్త్రములను ధరించవలయును. ఆ తరువాత పాలు అన్నము మునుగునట్లు నేయి పోసి ఆ మధుర పదార్థమును మోచేతి నుండి కారుచుండగా నీతో కలిసి కూర్చొని చల్లగా హాయిగా ఆరగించవలయును." ఇది భావము.

గాజులు – అనగా చక్రాంకణమునకు (సమాశ్రయణము) ముందాచార్యులు చేతికి కట్టు కంకణము.

భుజాభరణములు – అనగా తప్తచక్రాంకణము

అనగా బాహువులకు ఆచార్యులుంచెడు శంఖచక్ర ముద్రలు.

ఇక దుద్దులు – ఇవి ఎనిమిది రాళ్ళ దుద్దులు అనగా అష్టాక్షరీ మంత్రము. ఇది మండలాకారముగా నుండును.

ఇక చెవిపూలు - ఇవి రెండుగా ఉండును. అనగా ద్వయమంత్రము.

పాదాభరణము - అనగా నాలుగు చరణములతో నుండు చరమంత్రము.

ఇట్లు తిరుమంత్రము, ద్వయమంత్రము, చరమ మంత్రము, అను మూడు మంత్రములచే జ్ఞానవైరాగ్యములు బోధించబడును.

తిరుమంత్రము ఆత్మస్వరూప యథాత్మ్య జ్ఞానమును తెలుపును. ద్వయము ఉత్తర ఖండములో చెప్పబడిన కైంకర్యమునకు ముందు వాడునట్టి భక్తి ప్రధానమైనది గాన భక్తిపరము.

చరమ శ్లోకము త్యాజ్యాంశమున వైరాగ్యమును ముఖ్యముగా బోధించును. కావున వైరాగ్యపరము ఆభరణములు అనేకములనగా జ్ఞానభక్తి విరాగములు కూడా విషయపరముగా అనేకములుగా నుండును.

జ్ఞానము - అర్థపంచక విషయములు 5 విధములు

భక్తి - భగవద్భాగవతాచార్య పరముగా 3

విధములు

వైరాగ్యము - దారాపుత్ర విత్తాది భేదములచే పలు విధములు

వస్త్రములనగా - శేషత్వ జ్ఞానము

అలంకారమునకు వస్త్రము ముఖ్యమగునట్లు ఆత్మాలంకారమునకు శేషత్వమే ముఖ్యము కదా.

పాలు అన్నము - అనగా కైంకర్యము. అన్నిటిలో పరమాన్నము భోగ్యతాధిక్యము కలదు. కావున అన్నిటిలో అధిక భోగ్యత కలది. కావున కైంకర్యము చెప్పనగును.

నేయి అనగా పారతంత్ర్యము.

కైంకర్యమును పారతంత్ర్యముతో కనపడకుండా కప్పి వేయవలయును.

పాలు అనగా భగవత్కల్యాణ గుణములు.

అన్నము అనగా కళ్యాణగుణ పరిపూర్ణమగు భగవత్తత్వము.

నేయి అనగా భగవంతుని ఎడబాటును క్షణము కూడా సహించలేని ప్రీతి.

ఈ ప్రీతి మోచేతుల మీది నుండి కారుచుండ వలయుననినచో చేయి కర్మను సూచించును. కర్మల ద్వారా భగవంతుని యందలి ప్రీతి కనబడుచుండును అని అభిప్రాయము.

ఒకరితో ఒకరు కలిసి కూర్చుని భుజించ వలయును అనగా భాగవత గోష్ఠిని కోరుచున్నారని అభిప్రాయము.

మరియొక అర్థము.

హస్తాభరణము – అంజలి

భుజాభరణములు – ఫలసంగ కర్తృత్వ బుద్ధి లేకుండుట.

ఫలమును విడుచుట అవగా ఫలాశను విడిచి కర్తవ్య బుద్ధితో భగవదారాధన భగవంతునకు ప్రీతికరముగా చేయుట.

సంగమును విడుచుట అనగా భగవంతుడే తనకు శేషభూతుడనగు నా చేత తానిచ్చిన ఇంద్రియములతో

తన పనిని చేయించుకొనుచున్నాడను జ్ఞానము.

కర్తృత్వమును విడుచుట అనగా కర్మకాతడే కర్త, నేను కాదని తెలియుట.

కర్ణాభరణమనగా – భగవద్భాగవత ప్రసంగములను వినుట. అనగా భక్తియోగమని అభిప్రాయము.

చెవిపూలు – ద్వయమంత్రము

పాదాభరణములు – భగవద్భాగవతాచార్య సన్నిధికి నడిచి వెళ్ళుటయే.

ఇట్లు పలు ఆభరణములు అనగా అన్ని అవయవములకు ఆయా ఆభరణములు అని అభిప్రాయము.

జిహ్వకు – కీర్తించుట

మనసునకు – ధ్యానించుట

చేతులకు – అర్చించుట

నేత్రములకు – దర్శించుట

ముక్కునకు – తులసీ ఆఘ్రాణము

ఈ పాశురమున గోపికలు కోరినది బ్రహ్మాను భవమే.

'సోఽ శ్నుతే సర్వాన్ కామాన్ సహబ్రహ్మణా విపశ్చితా'

అను శ్రుతి వాక్యము బోధించు బ్రహ్మానుభవమునే ఇచట గోపికలు కోరినారని తెలియవలయును.

28. కఱవైగల్ పిన్‌శెన్ఱు కానమ్ శేర్‌న్దుణ్బోమ్
అఱివొన్ఱు మిల్లాద వాయ్‌క్కులత్తు, ఉన్దన్నై
ప్పిఱవి పెఱున్దనై పుణ్ణియమ్ నాముడైయోమ్;
కుఱై వొన్ఱు మిల్లాద కోవిన్దా! ఉన్దన్నోడు
ఉఱవేల్ నమక్కిం గొళిక్క వొళియాదు,
అఱియాద పిళ్ళైగళోమ్, అన్బినాల్ ఉన్దన్నై
చ్చిఱుపే రళైత్తనవుమ్ శీఱి యరుళాదే
ఇఱైవా నీతారాయ్ పఱై, యేలో రెమ్బావాయ్.

"గడ్డియున్నచోటు వెతకుకొని మేపుటకై పశువుల వెనుకనే పోయి ఆ అడవిలోనే శుచి శుభ్రత నియమము లేక తిని జీవించుటయే ప్రయోజనము... ...ము.

కొంచె మైనను తెలివిలేని గొల్లకులమున బుట్టిన మేము మా వంశమున మాతో సమానముగా నీవు పుట్టిన పుణ్యము కలవారము. మాకన్నియు లోపములే. నీకేలోటూ లేదు. గోవిందా! నీతో మాకున్న సంబంధమును నీవు కాని, మేము కాని పోగొట్టు కొనజాలము. లౌకికము తెలియని చిన్నపిల్లలము. అందుకే ప్రేమతో నిన్ను చిన్న పేరుతో పిలిచితిమి. అందుకే కోపము తెచ్చుకొని మా కోరికను మన్నింపకుండరాదు. మా కోరికయగు పరనొసంగుము."

ముక్త పురుషుడు పరమ పదమున పరమాత్మతో కలిసి అనుభవించు భోగమునే గోపికలు వెనుకటి పాశురమున కోరిరి. అట్లు అనుభవించుటకు కావలసినవి ఈ పాశురమున తెలుపు చున్నాడు.

సాంగవేదాధ్యయనము చేయవలయును.

అర్థజ్ఞానమును పొందవలయును.

వేద విహితమగు వర్ణాశ్రమాచార ధర్మములను పాటించవలయును.

అపుడు పాపము నశించి మనశ్శుద్ధి యేర్పడును. తరువాత ఇంద్రియములను విషయముల నుండి వెనుకకు మరలించి మనసును ఆత్మయందు నిలుపవలయును.

ఆత్మ సాక్షాత్కారము తరువాత పరమాత్మ యందు మనసు లగ్నము చేయవలయును. ఆ తరువాత శ్రవణ మననములను ఆచరించి అర్చన ప్రణామాది పురస్సరముగా నిరంతర భగవత్స్మృతి రూపమును దర్శన సమానాకారముగా ధ్యానము గావించవలయును. ఈ ధ్యానములో శరీర సంబంధమును కలిగించు పుణ్య పాపములు నశించి ముక్తుడై భగవదనుభవ భోగమును పొందజాలును.

దర్శన సమానాకారమగు నిరంతర భగవత్స్మృతికి సాధనము భగవత్స్వరూప జ్ఞానము. దానికి సాధనము ఆత్మావలోకనము. ఆత్మావలోకనమునకు జితేంద్రియ త్వము. జితేంద్రియత్వమునకు పాపక్షయము. పాప క్షయమునకు విహిత కర్మానుష్ఠానము, దానికి వేదార్థ పరిజ్ఞానము. దానికి వేదాధ్యయనము దానికి గురుకుల

వాసము సాధనములు.

ఈ పాశురమున ఇవియేమియు తమవద్ద లేవని ఆకించన్యమును అనన్యగతిత్వమును నివేదించుచున్నారు.

సిద్ధసాధనము నాశ్రయించువారలు చేయవలసిన విధానమును ఈ పాశురమున వివరించిరి.

భగవంతుడే ఉపాయమని నమ్మినవాడు భగవంతుని సమీపములో

1. భగవంతుని చేరుటకు సాధనముగా తాము ఆచరించిన పుణ్యకర్మలు ఏవియూలేవని తెలుపుకొనవలయును.
2. తనకే యోగ్యత లేదని నివేదించుటకు భగవత్సన్నిధిలో తన నికృష్టతను తానే చెప్పుకొనవలయును.
3. తన పుణ్యమంతయు తన స్వామియగు భగవానుడు అనంత కళ్యాణ గుణపరిపూర్ణు డగుటయే అని [illegible]ియ వలయును.

4. అనంత కళ్యాణగుణ పరిపూర్ణుడగు స్వామితో తనకు విడదీయరాని సంబంధమున్నదని తెలియ వలయును.
5. తానిదివరకు చేసిన అపచారములకు, ఉపచార భావముతో చేసిన అపచారములకు క్షమాపణ వేడవలయును.
6. నీవే మాకు ముందు ఉపాయముగా నుండి ఫలమును అనుగ్రహింపుమని కోరవలయును.

ఇదియే సత్కర్మాభావ విజ్ఞాపనము. స్వనికర్షానుసంధానము, ఈశ్వరగుణపూర్తి, సంబంధ జ్ఞానము, పూర్వాపరాధ క్షామణము, భగవదేకోపాయత్వ స్వీకారము అను ఆరింటిని ఈ పాశురమున వివరించుచున్నారు.

భగవానుడే ఉపాయమని ఆశ్రయించువారు అన్ని ఉపాయములను విడువవలయును. అవి విడచుట పలు విధములుగా నుండును. కర్మ, జ్ఞానము, భక్తి మొదలగు వాటిని ఉపాయముగా భావించి ఆచరించినవాడు వాటిని విడిచితిని అని నివేదించవలయును. వానిని ఆచరించ జాలనివాడు నేనాచరింపజాలను అని తెలుపుకొన

వలయును. ఆచరింపవలయునని తెలిసిననూ తన స్వరూపాను గుణము కాదని ఆచరించనివాడు అవి మాక తగినవి కావు అని నివేదించవలయును. అసలా విషయమునే తెలియని వారు నేను ఇతరోపాయము లున్నవని తెలియనైతినని చెప్పుకొనవలయును.

ఇదియే ఈ పాశురమున వివరించబడిన స్వాప దేశార్ధము

**29.** శిత్తుమ్ శిఱుకాలే వన్దున్నై చ్చేవిత్తు, ఉన్
పొత్తామరై యడియే పోత్తుమ్ పొరుళ్ కేళాయ్;
పెత్త మ్మేయ్‌త్తుణ్ణు ఙ్కులత్తిల్ పిఱన్ద నీ
కుత్తేవ లెఙ్గళై క్కొళ్ళామల్ పోకాదు;
ఇత్తై ప్పఱై కొళ్వా నన్ఱుకాణ్; గోవిన్దా!
ఎత్తైక్కు మేళేళుపిఱవిక్కుమ్, ఉన్దన్నో
డుత్తోమే యావో మునక్కే నామాళ్ శెయ్‌వోమ్,
మత్తై నఙ్గామఙ్గళ్ మాత్తే లోరెమ్బావాయ్.

“చిన్నపిల్లలు అందులో ఆడపిల్లలు లేవజాలని చలికాలమున తెల్లవారుటకు ముందు అనాదియగు అజ్ఞానాంధకారము తొలగి భగవద్విషయమగు జ్ఞాన

ప్రకాశము కలుగు కాలమున, అనగా చిట్టి వేకువలో లేచి నీవు వేంచేసియున్న చోటునకే మేము వచ్చి, నిన్ను సేవించి, అనగా పూజాద్రవ్యములను దాల్చి, పెరుమాళ్ళ సన్నిధికి వేరెదము అనుమాటవే అధికముగా భావించు నిన్ను అని తాత్పర్యము. మిక్కిలి విలువ గలవియై భోగ్యములై బంగారు తామరపూవులవలె సుందరములు, స్పృహణీయములు అయిన నీ పాదములకు మంగళము పాడుటలో అభిప్రాయమును వినుము.

ఎల్లపుడును వేదములలో మాత్రమే వినబడు నీవు పశువులను మేపుకొని జీవించవలసిన గొల్లజాతికి వచ్చి పుట్టి మా సేవను స్వీకరించక యుండరాదు. మా చేత అంతరంగిక కైంకర్యములను స్వీకరించి తీరవల యును. శబ్దాది విషయములే శరీరమును నిలబెట్టు సాధనములుగా గలిగియున్న మాకు నీ దివ్యమంగళ విగ్రహ సౌందర్యమును జూచి తిను అన్నము, త్రాగు నీరు, నములు తాంబూలము అన్నియునూ ఆశ్రిత సులభుడవైన నీవే స్వామీ అనునట్లు చేసి మా స్వరూపానుగుణమగు

కైంకర్యము నొసంగకుండుట నీకు తగదు.

నీ నుండి పరను పుచ్చుకొనుటకు వచ్చిన వారము కాదు. ఏనాటికిని ఏడేడు జన్మలకును నీతో విడరాని బంధుత్వము కలవారము కావలయును. నీకు మాత్రమే సేవలు చేయువారము కావలయును. మాకు ఇతరము లైన కోరికలేమియు లేకుండునట్లు అనుగ్రహించుము."

మార్గ శీర్ష మానమున గోపికలు తమ పెద్దల అనుమతితో వర్షమునకై చేసిన వ్రతమే ఈ ధనుర్మాస వ్రతము. పెద్దల తృప్తికొరకు తాము స్నానవ్రతము నాచరింతుమనియు, ఆ వ్రతమునకు పరయను వాద్యము కావలయునవి బయలుదేరి శ్రీకృష్ణుని సన్నిధి చేరి ఆ పరనిచ్చి తమకావ్రతమును పూర్తిచేయించి దాని ఫలముగా అలంకారములను పరమాన్నభోజనమును చేయింపుమని ప్రార్థించిరి.

ఇది వారి మనసులోని అసలు మాట కాదు. శ్రీకృష్ణ భగవానునితో కలిసి ఎడబాటు లేకుండగా స్వామికి కైంకర్యము చేయవలయుననియే అసలు అభిప్రాయము.

స్నానమనగా భగవత్ప్రాప్తి. పర యనగా భగవత్కైంకర్యమని వారి అభిప్రాయము.

ఈ వ్రతమును భగవంతుని చేరవలయునని కోరు వారందరు చేయదగిన వ్రతము. వ్రతమును ఆచరించుటకు ముందుగ భగవత్సంబంధులతో సంబంధమేర్పరచు కొనవలయును. దాని తరువాత శమదమాది ఆత్మగుణో పేతులై ఆచార్య సమాశ్రయణమును గావించవలయును. తరువాత మంత్రోపదేశమునొంది మంత్రార్థమును తెలియవలయును. ఉపాయము భగవంతుడైనను జీవులు సర్వేశ్వరు నాశ్రయించునపుడు ఇద్దరిని కలిపెడి అమ్మ వారిని ఆశ్రయించవలయును. ఆమె ద్వారా స్వామియే ఉపాయమని నిశ్చయించుకొని స్వామి కటాక్షపాత్రులు కావలయును. తరువాత స్వామిని దర్శించి మంగళా శాసనము గావించి భగవత్కటాక్షముతో స్వరూప జ్ఞానాదులను అపేక్షించి ముక్తులమై, బ్రహ్మాలంకారాద్య లంకృతులమై నిన్ను చేరి సాయుజ్యము నొందవలెనని ప్రార్థించవలయును. ఇదియే సంసారము నుండి విడివడి భగవానుని చేరి భగవదనుభవము వరకు చేయవలసిన

ప్రక్రియ. ఈ ప్రక్రియనే ఈ 27 పాశురములలో చెప్పియున్నారు.

ముఖ్యముగా తెలియదగిన రెండు విషయములను 28, 29 పాశురములలో వివరించి వ్రతమును ముగించుచున్నారు. 30వ పాశురమున ఫలమును వివరించిరి.

28వ పాశురమున ఉపాయము శ్రీకృష్ణుడే అని దృఢముగా చెప్పి తమకు తాముగా ఆర్జించుకొనిన జ్ఞానము సత్కర్మాచరణము లేదని నిర్హేతుక కృపతో తమ కులమున పుట్టిన శ్రీకృష్ణుడే తమ పుణ్యమని అతనికి తమకు విడదీయరాని సంబంధము కలదని మేము అతని వారమని, తమను స్వామి అయిన అతనే కాపాడి పురుషార్థమును ప్రసాదించగలడని చెప్పి యున్నాడు.

29వ పాశురమున ఫలమును తెలుపుచున్నారు. ఈ ఫలమును పొందగల అర్హత తమకే కలదని 'నమక్కే' అని తెలిపి ఈ యర్హతనే ఈ చివరి రెండు పాశురములలో తెలుపుచున్నారు.

అనన్య భోగ్యత్వము, అనన్యోపాయత్వము,

అనన్యార్హత్వము ఈ మూడు జీవుని స్వరూపములు.

అనగా భగవానుడే తప్ప ఇతర విషయముల ననుభవింపవలెనను కోరిక లేకుండుట (అనన్య భోగ్యత) భగవానుని పొందుటకు భగవానుడు తప్ప ఇతరము ఉపాయము కాదని నమ్మియుండుట (అనన్యోపాయత్వము) భగవానునికి తప్ప ఇతరునికి తానే విధముగను చెందకుండుట (అనన్యార్హత్వము) ఇవియే జీవుని లక్షణములు. ఇవి కలవారే భగవత్ప్రాప్తికి అర్హులు.

ఈ వ్రతమున గోపికలు రెండుమారులు తమ పరిశుద్ధిని వివరించిరి. ఆ రెండు ఉపాయ పరిశుద్ధి ఫలపరిశుద్ధి. ఈ రెంటిని ఈ రెండు పాశురములలో తెలుపుచున్నారు.

భగవానుడే ఉపాయము అని భావించిన వారికి తాము చేసిన కర్మజ్ఞాన భక్త్యాదులలో ఉపాయ భావనా రుచి, వాసనలతో లేకుండ పోవలయును. అంతేకాదు భగవానుని ఉపాయముగా స్వీకరించుట, ఉపాయమనెడి బుద్ధి కూడా ఉండరాదు. అటువంటి భావన మనమున

నున్నచో శవస్పర్శచే వలె అపవిత్రత ఏర్పడును. ఇలాంటి అపవిత్రత లేకపోవుట ఉపాయ పరిశుద్ధి.

భగవంతుని పొంది భగవత్కైంకర్యమును చేయు టయే ఫలము. ఆ భగవత్ప్రాప్తిలో వేరొక ప్రయోజన మును సాధించుకోవలయుననుకొనుట లేదా సాధించి వెళ్ళుట ఒక అపవిత్రత. ఆ భగవత్కైంకర్యము తన ప్రీతికే అనుకొనుట రెండవ అపవిత్రత. ఈ రెండు అపవిత్రతలలో భగవదనుభవమును పొందుట విషాహార మును లేదా ఎంగిలిని తిన్నట్లు దోషకార్యమగును. ఆ దోషములు లేకుండుటచే ఫలపరిశుద్ధి.

గోపికలకు ఈ రెండు పరిశుద్ధులు కలవు. 28వ పాశురమున ఉపాయపరిశుద్ధిని తెలిపిరి. ఈ పాశురమున ఫలపరిశుద్ధిని వివరించుచున్నారు.

ఇట్లు వెనుకటి పాశురమున ఈ పాశురమున ఉపాయ విరోధి, స్వరూప విరోధి ప్రాప్తి విరోధి, ప్రాప్య విరోధియను నాలుగు విరోధులు పరిహరించబడినవి. వెనుకటి పాశురమున జ్ఞానము మొదలగు

ఇతరోపాయములు తమకేవియు లేవని చెప్పుటచే భగవానుడే ఉపాయమను నిశ్చయమునకు ప్రతి బంధకములైన ఉపాయాంతర సంబంధము లేదని తెలిపిరి.

భగవంతుని చేరుటకు వెనుక చేసిన అపరాధములు ప్రతిబంధములుగా నిలువకుండగా క్షమాపణ చెప్పబడినది. ఇట్లు ప్రాప్తి ప్రతిబంధకములుగా నుండు పూర్వాప రాధములు లేవని కూడా తెలిపిరి. బాహ్య విషయము లందు సంగమమును విడిచి, భగవద్విషయ ములనందే రుచితో పొందనిదే ఉండలేక, ఆర్తితో చేరితిమనుటతో ఆత్మస్వరూప విరోధి సంబంధము లేదని తెలియుచున్నది.

మాకితరములైన కోరికలు ఉండకూడదనుటచే భగవదనుభవమున తనది అని కాని, తానునుభవించు చున్నానని బుద్ధి కూడా యుండరాదని తెలుపుటచే ప్రాప్యవిరోధి కూడా లేదని తెలియుచున్నారు.

ఇట్లు అన్ని ప్రతిబంధకములు తొలగి భగవంతునకే సర్వదేశ సర్వకాల సర్వావస్థలలో నిరంతరాయముగా కైంకర్యము చేయుచు, చేయు కైంకర్యము కూడా

భగవంతుని కొరకే భగవానుడే చేయించుకొనుచున్నాడని భావనతో ఉండుటయే తమకు పురుషార్థమని గోపికలు ఈ పాశురమున తమ ప్రతిఫలముగా వివరించిరి.

మరియు ఈ పాశురము అష్టాక్షరీ మంత్రార్థమును కూడా వివరించినది.

'గోవిందా! నీకు' అను మాటతో సర్వజగత్కార ణము సర్వజగద్రక్షకుడగు పరమాత్మకే అని అకారార్థము చెప్పబడినది.

'నీకే' అని ఏకారములో 'ఓం' లోని ఉకారార్థము సూచించబడినది. మేము అను దానితో మకారార్థము జీవసముదాయము తెలుపబడినది. ఇట్లు ప్రణవార్థము వివరించబడినది.

నీతో సర్వవిధ బంధుత్వము కలవారము అని చెప్పుటచే నారాయణ శబ్దార్థము తెలుపబడినది. ఎప్పటికి ఏడేడు జన్మలకు అని చెప్పుట వలన 'ఆయ' అను చతుర్థీ విభక్త్యర్థమును తెలుపుచున్నది.

ఇట్లు తెలుపుట వలన మూల మంత్రము వలన

ప్రతిపాదించబడు పరమార్థమే తన వ్రతమునకు పరమోద్దేశ్యమని ఈ పాశురమున తెలుపబడినది.

అజ్ఞానము చుట్టబడి, కటిక చీకటి నిండిన జీవితములో. సత్త్వముదయించిన వెంటనే భగవంతుని యందు అభిముఖ్యము కలిగి, భగవంతుని సమీపించి సేవించవలయును. భగవంతుని దివ్యమంగళ విగ్రహ సౌందర్యమును అనుభవించవలయును. ఈ యనుభవము అవిచ్ఛిన్నముగా సమృద్ధిగా నుండుటకు ఆ దివ్యసౌందర్యమునకు మంగళాశాసనము చేయవలయును. భగవదాభిముఖ్యము మనకు కలుగునట్లు చేసుకొనవలయును. 'భగవంతుడు అవతారమునెత్తి శ్రమించునది మా కొరకే కదా' అని విన్నవించి ఆర్తిని వెల్లడించవలయును. నీవు కాక మాకు వేరొక ఫలమును కోరుట లేదని స్వామికి విన్నవించ వలయును. నిత్య కైంకర్యమును అర్థించవలయును. మనకు స్వరూపోపాయ పురుషార్థములను పొందుటలో కలుగు ప్రతిబంధకమును తొలగించుమని ప్రార్థించ వలయును. ఇట్లు విన్నపము

గావించుకొని శ్రీకృష్ణ భగవానుని దివ్యముఖారవిందమును దర్శించు చుండుటయే జీవిత పరమార్థమని, ఇదే ఈ వ్రతమునకు పరమోద్దేశ్యమని తెలియదగును.

**30.** వఙ్గక్కడల్ కడైన్ద మాదవనై క్కేశవనై
త్తిఙ్గళ్ తిరుముగత్తు చ్చేయిళైయార్ శెన్ఱిఱైఞ్జి
అఙ్గప్పఱైకొణ్డవాత్తై, యణిపుదువై
పెఙ్గమలత్తణ్డెరియల్ పట్టర్‌పిరాన్ కోదైశొన్న
శఙ్గత్తమిళ్ మాలై ముప్పదుమ్ తప్పామే
ఇఙ్గిప్పరిశురై ప్పా రీరిరణ్డు మాల్వరైత్తోళ్
శెఙ్గణ్ తిరుముగత్తు చ్చెల్వ త్తిమాలాల్
ఎఙ్గుమ్ తిరువళుమ్ పెత్తిన్బుఱువ రెమ్బావాయ్.

“చెక్కతో చేయబడిన ఓడలు గల పాలసముద్రమును మధించి దేవతలకు అమృతమును ప్రసాదించినవాడు, బ్రహ్మరుద్రులకు ప్రభువు అగు శ్రీమన్నారా యణుని, పూర్ణచంద్రుని పోలిన అందమైన ముఖము, చక్కని ఆభరణములు ధరించిన గోపికలు వెళ్ళి మంగళా శాసనమును గావించి, గోకులమునందు పరయను

సాకుతో కైంకర్యమును పొందిన విధానమును, భూమండలము నకు అలంకారముగా నున్న శ్రీవిల్లి బుత్తూరులో నవతరించి చక్కని చల్లని తామర పూసలతో గూర్చబడిన మాలలను ధరించిన బ్రాహ్మణోత్తములగు పెరియాళ్వారుల (విష్ణు చిత్తుల) పుత్రిక యగు ఆండాళుతల్లి సాయించినది. గోపికలు సంఘంములుగా చేరి అనుభవించినది. ప్రబంధముగా ద్రవిడ భాషలో మాలారూపముగా నున్న 30 పాశురములను ఒక్కదానిని కూడా వదలక అన్ని పాశురములను ఈ సంసారమున అనుసంధించువారు, గొప్ప పర్వతముల వలె నున్న నాలుగు భుజములు, ఆశ్రితుల విషయమున తనకు గల వాత్సల్యముతో ఎఱ్ఱబడిన కన్నులు, అందమైన ముఖము, ఉభయ విభూతులకు అధినాయకత్వము గల శ్రియః పతిచే దృష్టాదృష్టముల విషయములలో సాటిలేని కృపను బడసి, బ్రహ్మానందము గలవారుగా నుందురు."

మనము పొందవలసిన ముఖ్యమగు పురుషార్థము మోక్షము. ఇదియే అమృతము. శాస్త్రమే మహాసము ద్రము.

శాస్త్రమును మథించినవారికే మోక్ష స్వరూపము తెలియును. తెలిసినవారికే లభించును. మన బుద్ధియే మందరము. అనుకూల ప్రతికూల శక్తులు దైవీ, ఆసురీ సంపదయే దేవదానవులు. మందరమును గొనివచ్చి సముద్రమున వేయించినది స్వామియే. గరుడునితో వేయించెను. 'దదామి బుద్ధియోగం తం' అని, 'మత్త స్మృతిర్జ్ఞాన మపోహనం చ' అని చెప్పియుండుటతో స్వామియే బుద్ధిని ప్రసాదించవలయును అని, అది ఆచార్య ముఖతః ఇప్పించును కావున ఆచార్యుడనగా గరుడుడు కావున ఆచార్యుని ద్వారా స్వామి బుద్ధి నిచ్చును అని మందర పర్వత వృత్తాంతము తెలుపు చున్నది.

పూర్వాచార్యులు ఇట్లు వ్యాఖ్యానము గావించిరి.

సంసారము మహాసముద్రము. శరీరములు నావ. భగవత్సంకల్పము మందరము. భగవత్కృప తాడు, భగవత్కటాక్షము చేతులు. పిరాట్టి (లక్ష్మి) ఆత్మ వస్తువు. ఇట్లు పరమాత్మ తన సంకల్పమును మందరమునకు కృపయను తాడుకట్టి, కటాక్షము లనెడి చేతులతో సంసార సాగరమును మథించి, తనకు ప్రియదమమగు ఆత్మను

పొందెను. చేతనులు పరమాత్మకు కౌస్తుభమణి వంటివారు. తాము ఆచరించిన పుణ్య పాపముల వలన సంసార సాగరమున పడిరి. అట్లు పడిన వారు గత్యంతరమును గానక అలమటించు చుండగా భగవంతుని నిర్హేతుక కృపాకటాక్షమాతనిపై పడును. దానికి సత్త్వముద్బుద్ధమై భగవత్ప్రాప్తికి అఱ్ఱులు చాచుచుండెను. ఇదియే సముద్రఘోష. పరదుఃఖము సహించలేని పరమాత్మకు ఈ ఘోషతో కృపకలుగును. ఈ కృపయే భగవత్సంకల్పమును త్రిప్పును. అట్లు వారి హృదయమునందు జ్ఞానజ్యోతిని వెలిగించి యజ్ఞా నాంధకారమును తొలగించు జీవులు తమను పొందుట కుపకరించు భక్తియోగమును తానే అనుగ్రహించును. ఇదియే అమృత మధనము. అట్లు భగవత్ప్రాప్తి యనెడి అమృతము లభించును. ఇదియే మోక్షము. ఇట్లు మోక్షమును ప్రసాదించమని పరమాత్మను ప్రార్థించుట, ఈ తిరుప్పావు వ్రతము నాచరించిన వారికి ఈ అమృతము లభించునని ఫలశ్రుతిగా అమ్మవారు

అనుగ్రహించుచున్నారు.

వేదము సముద్ర జలమువలె స్వతస్సిద్ధమైనది. తిరుప్పావై ప్రబంధము గోదాదేవి ముఖారవిందము నుండి వెలువడినది కావున మేఘ జలము వంటిది. మేఘము సముద్రము నుండి ఉప్పునీటిని తీసుకొని అత్యంత మధురజలమును మనకు కురియుచుండును. ఈ గోదామేఘము సకలోపనిషత్సిద్ధమగు అర్థములను గ్రహించి సకల జనులకు అర్థమగు రీతిని సరళ శైలిలో అమృతోపమానముగా వర్ణించినది. ఇదియే తిరుప్పావు ప్రబంధవైభవము.

ఈ ముప్పది పాశురములు తప్పక అనుసంధానము చేసిన తెలియనగు అంతరార్థమిది.

1. పరమాత్మయందు మనకు అభిముఖ్యమును కలిగించు బ్రాహ్మీ ముహూర్త ప్రభావమును తప్పక తెలియవలయును.
2. చేయవలసిన దానిని చేయకూడని దానిని తెలియ వలయును.

3. 'లోకాస్సమస్తాః సుఖినో భవంతు' అని సకల లోక కళ్యాణమును త్రికరణశుద్ధిగా కాంక్షించుచుండ వలయును.
4. జ్ఞానులగు పరమ భాగవతోత్తములు దేవతలను కూడా శాపించగలరని తెలియవలయును.
5. భగవంతుని ఉపాయముగా ఆశ్రయించిన క్షణము ననే సకల పాపనివృత్తి జరుగును అని తెలియ వలయును.
6. భగవద్విషమున అప్పుడే ప్రవేశించినవారైనను
7. భగవద్విషయమున ప్రవేశించి కూడ కొరత తీరని వారైనను
8. కీర్తిని ప్రధానముగా కోరువారైనను
9. విడువదగినది కొద్దిగా మాత్రమే తెలిసిన వారైనను
10. నిరంతరానుభవమునున్న వారైనను
11. భాగవతవంశ సంబంధము గలవారైనను
12. కైంకర్య నిష్ఠులతో సంబంధము గలవారిని
13. స్వరూపమును, జ్ఞానములోని వైలక్షణ్యాను సంధాన

పూర్వకముగా కార్యశూన్యులుగా నున్నవారిని

14. భక్తిపరాకాష్టచే కలత చెందుచున్న వారిని

15. భాగవత పారతంత్ర్య నిష్ఠనే ముఖ్యముగా పాలించు వారైనను, ఇట్టి వారందరూ మనకు ప్రాప్యులే అను దృఢ నిశ్చయము లోపించరాదు. ఇవి అన్నియూ తెలియవలయును.

16. భగవంతుని సమీపించు విధానము తెలియ వలయును.

17, 18, 19, 20 పాశురములలో పురుషకారభూతుల స్వరూప స్వభావములను బాగుగా తెలిసి వారి విషయమున ప్రవర్తించు విధిని తెలియవలయును.

21. భగవంతుని కళ్యాణగుణములను తెలిసి ఆనంద పారవశ్యమును చెందవలయును.

22. అభిమానమును పూర్తిగా విడిచి భగవత్కటాక్షైక పాత్రులు కావలయును. ఆ కటాక్షమే తారకముగా భావించవలయును.

23. భగవంతుని మాకు అభిముఖుడవు కావలసినదిగా

ప్రార్థించవలయును.

24. మంగళాశాసన తత్పరులు కావలయును.
25. వేము వచ్చినది నిన్ను ప్రార్థించుటకే అని తెలియునట్లు నైచ్యమును కనబరచవలయును.
26. మోక్షాపేక్షయున్నపుడు కావలసిన వానిని కోర వలయును.
27. ముక్తుడైన యవస్థలో అనుభవించదగిన పదార్థము లను కోరవలయును.
28. ఆ ఫలమును పొందుటకు మాకు గత్యంతరము లేదని ఎరిగించవలయును.
29. నిత్యకైంకర్యమునందు తమకున్న ననన్యాపేక్షను విడువకుండా ఉండవలయును.
30. ఈ స్థితిని పొందిన భాగవతోత్తముల శ్రీసూక్తి ఆనందదాయకముగా భావించుచు నుండవ యును.

ఇవి 30 దివసముల ప్రణాళిక. లేదా 30 పాశురముల భావము. ఈ వ్రతమునకు అంతరార్థమ

పరమార్థము కూడా అందుకే 30 పాశురములను తప్పకుండా అనుసంధానమును చేయవలయును. అనగా ఈ 30లో ఈ ఒక్క సోపానమును తప్పిననూ వ్రత భంగమైనట్టే. కావున ఈ విధానమును అనుసరించినచో స్వామి అనుగ్రహమును పొందెదము అని ఫలశ్రుతిగా పేర్కొనబడినది.

ఇట్లు అన్ని ఫలములు సిద్ధించుటచే ఈ ప్రబంధ మును అధ్యయనము చేసినవారు ఆనంద నిర్భరులగు దురు. ఈ లోకములో నుండు సంసారులందరి కంటే విశిష్టమగు స్థితి ననుభవింతురు. ఇక ఈ లోకమును విడిచి పరమపదమునకు వెళ్ళినచో, సర్వ కాలములలో భగవత్సంశ్లేషమును చెంది పరమా నందమును పొందెదరు. శ్రీమన్నారాయణ కృపాపాత్రులై ఆనందము ననుభవించుటకు, సాధనాంతరములను విడిచి ఈ వ్రతమును ఆచరించుట ఈ ప్రబంధము నధ్యయనము చేయుటయే కావలసినది.

అన్ని వయసులలోని వారు, అన్ని ఆశ్రయము లలోని

వారు అన్ని వర్ణములవారు, స్త్రీలు, పురుషులు కూడా భగవంతుని శరణు పొందినవారై ఈ వ్రతమును ఆచరించినవారు కోరిన ఫలము నంతటిని పొందగలరు.

అవివాహితలగు కన్యలు ఈ వ్రతము నాచరించి నచో, లేదా ఈ 30 పాశురములను చదువుకొనిననూ గోపికలు శ్రీకృష్ణుని, గోదాదేవి, రంగనాథుని పొంది నట్లు యోగ్యుడగు భర్తను పొందెదరు.

కర్మయోగులకు కర్మనిష్ఠ, జ్ఞానయోగులకు జ్ఞాన యోగనిష్ఠ, భక్తులకు భక్తినిష్ఠ, ఈ వ్రతాచారములో లేదా ఈ ప్రబంధాధ్యయనముతో ఏర్పడును. భగ వంతునే పొందవలయువను కోరిక కలవారికి, భగవత్కైంకర్యము చేయు కోరిక కలవారికి ఈ వ్రతముచే లేదా ఈ ప్రబంధాధ్యయనముచే భగవత్ప్రాప్తి భగవత్కైంకర్యము కూడా లభించును.

ఇట్లు అన్ని ఫలములను ప్రసాదించు ఈ వ్రతమును గోదాదేవి తానాచరించిన విధానమును ముప్పది పాశురములుగా జీవులను తరింపచేయుటకు అను

గ్రహించినది. మనము గోదాదేవివలె వ్రతము చేయజాల కున్ననూ పరిశుద్ధమగు మనస్సుతో ముప్పది పాశురములు విడువక చదువువారికి గోదాదేవికి లభించిన ఫలము నంతయునూ లభించును.

ఇక ఈ తిరుప్పావునందు తిరుమంత్రార్థ వివరణ కూడా కలదు. చూడుడు :- 'ఊళిముదల్వన్' అనునది అకారార్థమగు కారణత్వము. 'ఉనక్కే' అనుదాని వలన ఉకారార్థమగు అనన్యార్హ శేషత్వము, నమక్కే అనుదాని వలన మకారార్థము ప్రకృతి విలక్షణమగు శేషభూతుడగు ఆత్మస్వరూపము చెప్పబడినది కావున ఇట్లు ప్రణవార్థము సూచించబడినది.

'తూయోమాయ్ వందునామ్' తూయోమాయ్ వందోమ్' 'అభిమాన భంగమాయ్ వందు' మత్తైనంకా మంగళ్ మాత్తు' ఇత్యాది వాక్యములతో నమశ్శబ్దార్థ మగు పారతంత్ర్యము సూచించబడినది.

'కదిర్ మదియంబోల్ ముగత్తాన్' 'నారాయణనే' 'నారాయణన్ మూర్తి' అని చెప్పుట వలన నారాయణ

శబ్దార్థము సూచించబడినది.

'ఉరవేల్ నమక్కు' 'ఇంగొళిక్కవళియాదు' అని చెప్పుట వలన నారాయణ శబ్దార్థముగా పేర్కొనబడిన సకల విధబంధుత్వము 'ఎత్తైక్కుం, ఏళేళుపిరవిక్కుం ఉందన్నోడుత్తేమే యావోం, ఉనక్కేనా మట్చెయ్ వోం' అను వాటివలన నారాయణపదముతో నున్న చతుర్థీ విభక్తి అర్థమగు కైంకర్యము కూడా సూచించబడుటచే తిరుప్పావు తిరుమంత్రార్థ వివరణమగుచున్నది.

మరియు ఇట్లే 'కరవైగళ్ పిన్ శొన్ను' అను పాశురమున 'సర్వధర్మాన్ పరిత్యజ్య' అని ప్రపత్తికి అంగముగా చెప్పబడిన కర్మయోగాదులందలి ఉపాయ బుద్ధి పరిత్యాగమును, 'ఉన్నైయరుత్తిత్తు వందోమ్' అను దానివలన 'శిత్తుం శిరుకాలే వందున్నైసేవిత్తు' అను దానివలన 'మామేకం శరణం వ్రజ' అను వాక్యార్థము సూచించబడినది. 'వాయినాల్పాడి మనత్తినాల్ శిందిక్క' 'పొయ్ పిళయుం పుగుదరువా నిన్ననవుం' అను వాక్యముల వలన 'అహంత్వా సర్వపాపేభ్యోమోక్ష

యిష్యామి' అను వాక్యార్థము, 'నరుత్తముంతవిరిన్దు మగిళిన్దు' అను దానివలన 'మాశుచః' అను అర్థము సూచించబడినది. కావున తిరుప్పావు చరమమంత్ర సారముగా బోధించబడినది యని తెలియవలయును.

ఇట్లే ఈ తిరుప్పావు ద్వయమంత్ర వివరణ యనునది సంప్రదాయార్థము.

'నప్పిన్న నంగాయ్ తిరవేతుయిలెళాయ్' అనుదాని లోని 'తిరవే' అను పదముతో శ్రీశబ్దార్థము, 'ఎత్తన యేలుంపిరి వాత్త గిల్లాయాల్' అనుటచే మతుప్ ప్రత్యయార్థమైన నిత్య సంబంధము, 'ఓంగియుళ గళంద' అను పాశురమున స్వామి సౌశీల్యము చెప్పబడినది. 'తాయైక్కుడల్ విళక్కంసెయ్‌ద దామోదారనై' అను దానివలన సౌలభ్యము 'దేవాదిదేవనై శెన్నునాం సేవిత్తాల్' అనుదానితో స్వామిత్వము 'శెప్పముడయామ్ తిరలుడ యామ్' అను పదములతో ఆర్జవము చెప్పబడుచున్నది.

'ఆలినిలయాయ్' అను దానివలన అఘటిత ఘటనా సామర్థ్యము 'కుఱైవొన్ను మిల్లాద గోవిందా!' అను

దానివలన వాత్సల్యము తెలుపబడుట వలన నారాయణ పదార్థము వివరించబడినది. 'పాల్కడలుల్ వయత్తుయిన్న పరమానడిపాడి', 'ఓంగియుళగళంద', 'అంబర మూడరుత్తో', 'అన్నివ్వులుగ మళందాయ్', అను వాక్యముల వలన చరణ శబ్దార్థము వివరించబడినది.

'కార్మేనిచ్చెంగణ్ కదిర్ మదియంబోల్ ముగత్తాన్' 'ఊళిముదల్వ నురువంబోల్ మెయ్కరిత్తు' 'ముగిల్ వణ్ణన్ పేర్ పాడి' 'శంగోడు శక్కరమేందుంత డక్కైయన్', 'పంగయక్కణ్ణానై' అను వాక్యముల వలన దివ్యమంగళ విగ్రహ విశిష్టత్వము వివరించబడినది.

'కురైవొన్ను మిల్లాద గోవిందా' అనుదాని వలన కళ్యాణ గుణ విశిష్టుడగు నారాయణుని ఉపాయత్వ పరిపూర్తి, అరివొన్ను మిల్లాద వాయర్కుల్లత్తు, అరియాదపిళ్ళైగలోం' అనువాటి వలన అధికారి స్వరూపమగు ఆకించన్యము వివరించబడినది.

'తూయోమాయ్ వందునాం', 'తీయినిల్ తూ శాగుం' అని 'వందుతలై ప్పెయ్దోం' అను వాటివలన

అనిష్టనివృత్తిని ఇష్టప్రాప్తిని కలిగించు ఉపాయముగా స్వీకరించుట అను ఉపాయ వరణము 'అవావేన్నారా యందరుల్' 'అంగణిరండుంగొండు', 'ఎంగళ్‌మేల్ నోక్కదియెల్' అని 'ఇరైవానీతారాయ్ పఱై' అని పరగత స్వీకారవైభవము వివరించబడినది.

'నాత్తత్తుళాయ్‌ముడి నారాయణన్' అని, 'దేవాది దేవనై', అని 'ఉంబర్ కోమానై' అని ద్వయ మంత్రము లోని ఉత్తరార్థము నందలి నారాయణ పదముతో తెలుపబడు శేషిత్వము వివరించబడినది. 'ఉక్కముం తట్టొళియుంతందున్మణాళనై, ఇప్పోదెనీరాట్టు', 'మాలే మణివణ్ణా', 'కూడారై వెల్లుంశీర్' అను వాటివలన ఉత్తర వాక్యములోని నారాయణ పదములోని చతుర్థీ విభక్తిచే తెలుపబడు కైంకర్యోపకరణములు తెలుపబడు చున్నవి.

'ఉనక్కేనామాట్చెయ్ వోం', 'మత్తనంకా మంగళ్ మాత్తు' అనువాటి వలన నమఃపదము తెలుపు కైంకర్య విరోధి నిరసన ప్రార్థన వివరించబడినది. ఇట్లు తిరుప్పావు ప్రబంధము సమగ్రముగా ద్వయమంత్రార్థ వివరణమని

బోధపడుచున్నది.

ఇట్లు గురుపరంపరానుసంధాన పూర్వకముగా ద్వయమంత్ర తిరుమంత్ర చరమమంత్రార్థములను ఈ ప్రబంధము ఉపదేశించుచున్నది. అందువలవనే ఉడయ వరులు ఈ ప్రబంధమును ప్రతినిత్యము అనుసంధానము గావించుచు 'తిరుప్పావై జీయర్' అను తిరునామమును పొందిరి. అందువలన ఈ తిరుప్పావై ప్రబంధమును పొందిరి. అందువలన ఈ తిరుప్పావై ప్రబంధమును అందరూ ప్రతినిత్యమూ. అనుసంధానము గావించు కొనుచు గోదారంగనాథుల రామానుజుల ఆళ్వారుల అను గ్రహమును పొంది తరించెదరు.

శ్రియై నమః
అస్మద్గురుభ్యోనమః
శ్రీమతే రామానుజాయనమః

**పుష్పార్చనారంభించునప్పుడు ఈ 24 విభవ నామములతో ముందుగ పూజించవలెను.**

1. ఓం కేశవాయనమః
2. ఓం నారాయణాయ నమః
3. ఓం మాధవాయ నమః
4. ఓం గోవిన్దాయ నమః
5. ఓం విష్ణవే నమః
6. ఓం మధుసూదవాయ నమః
7. ఓం త్రివిక్రమాయ నమః
8. ఓం వామనాయ నమః
9. ఓం శ్రీధరాయ నమః
10. ఓం హృషీకేశాయ నమః
11. ఓం పద్మనాభాయ నమః
12. ఓం దామోదరాయ నమః

13. ఓం సంకర్షణాయ నమః

14. ఓం వాసుదేవాయ నమః

15. ఓం ప్రద్యుమ్నాయ నమః

16. ఓం అనిరుద్ధాయ నమః

17. ఓం పురుషోత్తమాయ నమః

18. ఓం అధోక్షజాయ నమః

19. ఓం నారసింహాయ నమః

20. ఓం అచ్యుతాయ నమః

21. ఓం జనార్దనాయ నమః

22. ఓం ఉపేంద్రాయ నమః

23. ఓం హరయే నమః

24. ఓం శ్రీకృష్ణాయ నమః

# శ్రీ కృష్ణాష్టోత్తర శతనామావళిః

ఓం శ్రీకృష్ణాయ నమః

ఓం కమలావాథాయ నమః

ఓం వాసుదేవాయ నమః

ఓం సనాతనాయ నమః

ఓం వసుదేవాత్మజాయ నమః

ఓం పుణ్యాయ నమః

ఓం లీలామానుషవిగ్రహాయ నమః

ఓం శ్రీ వత్సకాస్తుభధరాయ నమః

ఓం యశోదావత్సలాయ నమః

ఓం హరయే నమః 10

ఓం చతుర్భుజాత్త చక్రాసిగదా
శార్ఙ్గాద్యాయుధాయ నమః

ఓం దేవకీనన్దనాయ నమః

ఓం శ్రీశాయ నమః

ఓం నన్దగోపప్రియాత్మజాయ నమః

ఓం యమునావేగసంహారిణే నమః

ఓం బలభద్రప్రియానుజాయ నమః

ఓం పూతనాజీవిత హరాయ నమః

ఓం శకటాసురభంజనాయ నమః

ఓం నన్దవ్రజ జనానందినే నమః

ఓం సచ్చిదానన్దవిగ్రహాయ నమః 20

ఓం నవనీతవిలిప్తాంగాయ నమః

ఓం నవనీతనటాయ నమః

ఓం అనఘాయ నమః

ఓం నవనీతనవాహారాయ నమః

ఓం ముచికుందప్రసాదకాయ నమః

ఓం షోడశ స్త్రీ సహస్రేశాయ నమః

ఓం త్రిభంగినే నమః
ఓం మధురాకృతయే నమః
ఓం శుకవాగమృతాబ్ధీందవే నమః
ఓం గోవిందాయ నమః 30
ఓం యోగినాంపతయే నమః
ఓం వత్సవాటచరాయ నమః
ఓం అనంతాయ నమః
ఓం ధేనుకాసురభంజనాయ నమః
ఓం తృణీకృత తృణావర్తాయ నమః
ఓం యమళార్జునభఞ్జనాయ నమః
ఓం ఉత్తాలతాలభేత్రే నమః
ఓం తమాలశ్యామలాకృతయే నమః
ఓం గోపగోపీశ్వరాయ నమః
ఓం యోగినే నమః 40

ఓం కోటిసూర్య సమప్రభాయ నమః

ఓం ఇలాపతయే నమః

ఓం యాదవేంద్రాయ నమః

ఓం యదూద్వహాయ నమః

ఓం వనమాలినే నమః

ఓం పీతవాససే నమః

ఓం పారిజాతాపహారకాయ నమః

ఓం గోవర్ధనాచలోద్ధర్త్రే నమః

ఓం గోపాలాయ నమః 50

ఓం సర్వపాలకాయ నమః

ఓం అజాయ నమః

ఓం నిరంజనాయ నమః

ఓం కామ జనకాయ నమః

ఓం కంజలోచనాయ నమః

ఓం మధుఘ్నే నమః

ఓం మధురానాథాయ నమః

ఓం ద్వారకానాయకాయ నమః

ఓం బలినే నమః

ఓం బృన్దావనాంతసంచారిణేనమః 60

ఓం తులసీదామభూషణాయ నమః

ఓం శమంతకమణేర్హర్త్రే నమః

ఓం నరనారాయణాత్మకాయ నమః

ఓం కుబ్జాకృష్టామ్బరధరాయ నమః

ఓం మాయినే నమః

ఓం పరమపూరుషాయ నమః

ఓం ముష్టికాసుర చాణూర మల్లయుద్ధ
విశారదాయ నమః

ఓం సంసారవైరిణే నమః

ఓం కంసరాయే నమః
ఓం మురారయే నమః 70
ఓం నరకాంతకాయ నమః
ఓం అనాది బ్రహ్మచారిణే నమః
ఓం కృష్ణావ్యసనకర్శకాయ నమః
ఓం శిశుపాలశిరశ్ఛేత్రే నమః
ఓం దుర్యోధనకులాన్తకాయ నమః
ఓం విదురాక్రూరవరదాయ నమః
ఓం విశ్వరూప ప్రదర్శకాయ నమః
ఓం సత్యవాచే నమః
ఓం సత్యసంకల్పాయ నమః
ఓం సత్యభామారతాయ నమః 80
ఓం జయినే నమః
ఓం సుభద్రాపూర్వజాయ నమః
ఓం విష్ణవే నమః

ఓం భీష్మముక్తి ప్రదాయకాయ నమః

ఓం జగద్గురవే నమః

ఓం వేణునాదవిశారదాయ నమః

ఓం వృషభాసుర విధ్వంసినే నమః

ఓం బాణాసురకరాంతకాయ నమః

ఓం యుధిష్ఠిర ప్రతిష్ఠాత్రే నమః

ఓం బర్హిబర్హావతంసకాయ నమః 90

ఓం పార్థసారథయే నమః

ఓం అవ్యక్తాయ నమః

ఓం గీతామృత మహోదధయే నమః

ఓం కాళీయఫణిమాణిక్యరంజిత
శ్రీపదాంబుజాయ నమః

ఓం దామోదరాయ నమః

ఓం యజ్ఞభోక్త్రే నమః

ఓం దానవేంద్రవినాశకాయ నమః

ఓం నారాయణాయ నమః

ఓం పరస్మై బ్రహ్మణే నమః

ఓం పన్నగాశనవాహనాయ నమః 100

ఓం జలక్రీడాసమాసక్త గోపీవస్త్రాపహారకాయ నమః

ఓం పుణ్యశ్లోకాయ నమః

ఓం తీర్థపాదాయ నమః

ఓం వేదవేద్యాయ నమః

ఓం దయానిధయే నమః

ఓం సర్వతీర్థాత్మకాయ నమః

ఓం సర్వగ్రహరూపిణే నమః

ఓం పరాత్పరాయ నమః 108

ఇతి శ్రీ కృష్ణాష్టోత్తర శతనామావళిః సమాప్తా.

# శ్రీ గోదాష్టోత్తర శతనామావళిః

ఓం శ్రీరంగనాయక్యై నమః

ఓం గోదాయై నమః

ఓం విష్ణుచిత్తాత్మజాయై నమః

ఓం సత్యై నమః

ఓం గోపీవేషధరాయై నమః 5

ఓం దేవ్యై నమః

ఓం భూసుతాయై నమః

ఓం భోగశాలిన్యై నమః

ఓం తులసీకాననోద్భూతాయై నమః

ఓం శ్రియై నమః 10

ఓం ధన్విపురవాసిన్యై నమః

ఓం ఆముక్తమాల్యదాయై నమః

ఓం బాలాయై నమః 15

ఓం రంగనాథప్రియాయై నమః

ఓం పరాయై నమః

ఓం విశ్వంభరాయై నమః

ఓం కలాలాపాయై నమః

ఓం యతిరాజసహోదర్యై నమః 20

ఓం కృష్ణానురక్తాయై నమః

ఓం సుభగాయై నమః

ఓం సులభశ్రియై నమః

ఓం సలక్షణాయై నమః

ఓం లక్ష్మీ ప్రియసఖ్యై నమః 25

ఓం శ్యామాయై నమః

ఓం దయాంచిత దృగంచలాయై నమః

ఓం ఫల్గుణ్యావిర్భవాయై నమః
ఓం రమ్యాయై నమః
ఓం ధనుర్మాసకృత వ్రతాయై నమః 30
ఓం చంపకాశోక పున్నాగ మాలతీ
విలసత్కచాయై నమః
ఓం ఆకారత్రయ సంపన్నాయై నమః
ఓం నారాయణ సమాశ్రితాయై నమః
ఓం శ్రీమదష్టాక్షరీ మంత్రరాజస్థిత
మనోరథాయై నమః
ఓం మోక్షప్రదాన నిపుణాయై నమః 31
ఓం మంత్రరత్నాధి దేవతాయై నమః
ఓం బ్రహ్మణ్యాయై నమః
ఓం లోకజనన్యై నమః

ఓం లీలామానుషరూపిణ్యై నమః
ఓం బ్రహ్మజ్ఞాయై నమః 40
ఓం అనుగ్రహాయై నమః
ఓం మాయాయై నమః
ఓం సచ్చిదానంద విగ్రహాయై నమః
ఓం మహాపతివ్రతాయై నమః
ఓం విష్ణుగుణకీర్తన లోలుపాయై నమః 45
ఓం ప్రపన్నార్తిహరాయై నమః
ఓం నిత్యాయై నమః
ఓం వేదసౌధవిహారిణ్యై నమః
ఓం శ్రీరంగనాథ మాణిక్య మంజర్యై నమః
ఓం మంజుభాషిణ్యై నమః 50
ఓం సుగంధార్థ గ్రంథకర్త్ర్యై నమః

ఓం రంగమంగళదీపికాయై నమః

ఓం ధ్వజవజ్రాంకుశాబ్జాంక -

మృదుపాద తలాంచితాయైనమః

ఓం తారకాకార- నఖరాయై నమః

ఓం ప్రవాళ - మృదుళాంగుళ్యై నమః 55

ఓం కూర్మోపమేయ పాదోర్ధ్వ -

- భాగాయై నమః

ఓం శోభన పార్ష్ణి కాయైనమః

ఓం వేదార్థభావవిదిత తత్త్వబోధాంఘ్రి

పంకజాయై నమః

ఓం ఆనంద - బుద్బుదాకార -

సుగుల్ఫాయై నమః

ఓం పరమాయై నమః 60

ఓం అణుకాయై నమః

ఓం తేజశ్శ్రియోజ్జ్వలధృత - పాదాంగుళి
సుభూషితాయై నమః

ఓం మీనకేతన తూణీర చారుజంఘా-
విరాజితాయై నమః

ఓం కకుద్వజ్జాను యుగ్మాఢ్యాయై నమః

ఓం స్వర్ణరంభాభ - సక్థికాయై నమః 65

ఓం విశాల జఘనాయై నమః

ఓం పీనసుశ్రోణ్యై నమః

ఓం మణి మేఖలాయై నమః

ఓం ఆనంద - సాగరావర్త - గంభీరాంభోజ
నాభికాయై నమః

ఓం భాస్వద్వళిత్రికాయై నమః 70

ఓం చారుజగత్పూర్ణమహోదర్యై నమః

ఓం నవమల్లీ రోమరాజ్యై నమః
ఓం సుధాకుంభాయితస్తన్యై నమః
ఓం కల్పమాలానిభ భుజాయై నమః
ఓం చంద్రఖండ నఖాంచితాయై నమః 75
ఓం సుప్రవాళాంగుళీన్యస్త - మహా
రత్నాంగుళీయకాయై నమః
ఓం నవారుణప్రవాళాభ పాణిదేశ -
సమంచితాయై నమః
ఓం కంబుకంఠ్యై నమః
ఓం సుచుబుకాయై నమః
ఓం బింబోష్ఠ్యై నమః 80
ఓం కుందదంతయుజే నమః
ఓం కారుణ్యరస నిష్యంది - నేత్రద్వయ
సుశోభితాయై నమః

ఓం ముక్తా-సుచిస్మితాయై నమః

ఓం చారుచాం పేయ-

నిభనాసికాయై నమః

ఓం దర్పణాకార - విపుల - కపోల

ద్వితయాంచితాయై నమః

ఓం అనంతార్క ప్రకాశోద్యన్మణి -

తాటంకశోభితాయై నమః

ఓం కోటిసూర్యాగ్నిసంకాశ నానా

భూషణభూషితాయై నమః

ఓం సుగంధవదనాయై నమః

ఓం సుభ్రువే నమః

ఓం అర్ధచంద్రలలాటికాయై నమః 90

ఓం పూర్ణచంద్రాననాయై నమః

ఓం నీలకుటిలాలక శోభితాయై నమః
ఓం సౌందర్యసీమాయై నమః
ఓం విలసత్కస్తూరీ తిలకోజ్జ్వలాయై నమః
ఓం దగద్ధగాయమానోద్యన్మణి
సీమంత భూషణాయై నమః 95
ఓం జాజ్జ్వల్యమాన-సద్రత్న-దివ్య
చూడావతంసకాయై నమః
ఓం సూర్యార్ధచంద్ర - విలసత్
భూషణాంచిత వేణికాయై నమః
ఓం నిగన్ని గద్రత్న పుంజప్రాంతస్వర్ణ
నిచోళికాయై నమః
ఓం సద్రత్నాంచితవిద్యోతద్
విద్యుత్కుంజాభ శాటికాయై నమః

ఓం అత్యర్కానల తేజోధికమణి
కంచుక ధారిణ్యై నమః
ఓం నానామణిగణాకీర్ణ హేమాంగద
సుభాషితాయై నమః
ఓం కుంకుమాగరు కస్తూరీ దివ్య
చందన చర్చితాయై నమః
ఓం స్వోచితౌజ్వల్య వివిధ - విచిత్ర
మణిహారిణ్యై నమః
ఓం అసంఖ్యేయ సుఖస్పర్శ - సర్వా
తిశయభూషణాయై నమః
ఓం మల్లికా పారిజాతాది దివ్య పుష్ప-
స్రగంచితాయై నమః
ఓం శ్రీరంగనిలయాయై నమః

ఓం పూజ్యాయై నమః
ఓం దివ్యదేశ సుశోభితాయై నమః
ఓం శ్రీరంగనాయక్యై నమః

## శ్రీ గోదా ష్టోత్తరశతనామావళి
## సంపూర్ణా.

❁ ❁ ❁

### అష్టోత్తరములు పూర్తికాగానే
### ఈ క్రింది నామములను అనుసంధించవలెను

ఓం శ్రీమహాలక్ష్మ్యై నమః 1
ఓం శ్రీభూదేవ్యై నమః 2
ఓం శ్రీనీళాదేవ్యై నమః 3
ఓం శ్రీగోదాదేవ్యై నమః 4

ఓం అనంతాయ నమః 5

ఓం శ్రీగరుడాయ నమః 6

ఓం శ్రీమతే విష్వక్సేనాయ నమః 7

ఓం శ్రీపరాంకుశాయ నమః 8

ఓం శ్రీమతే రామానుజాయ నమః 9

ఓం శ్రీమద్వరవరమునయే నమః 10

ఓం స్వాచార్యేభ్యో నమః 11

ఓం పూర్వాచార్యేభ్యో నమః 12

ఓం సమస్తపరివారాయ సర్వదివ్య మంగళ విగ్రహాయ
శ్రీమతే నారాయణాయ నమః

శ్రీ రంగనాయక్యై నమః

# శ్రీ గోదా కల్యాణము

(ఆరాధన పూర్తి అయిన తరువాత కల్యాణ సామాగ్రిని సమకూర్చుకొని, గోదా రంగనాథులను వేదికపై వేంచేపు చేసి ఆచమనము చేయవలెను.)

ఆచమ్య :

ఓం అచ్యుతాయ నమః

ఓం అనంతాయ నమః

ఓం గోవిందాయ నమః

(చేతులు శుద్ధిచేసుకొని)

ఓం కేశవాయ నమః

ఓం నారాయణాయ నమః

ఓం మాధవాయ నమః

ఓం గోవిందాయ నమః

ఓం విష్ణవే నమః

ఓం మధుసూదనాయ నమః

ఓం త్రివక్రమాయ నమః

ఓం వామనాయ నమః

ఓం శ్రీధరాయ నమః

ఓం హృషీకేశాయ నమః

ఓం పద్మనాభాయ నమః

ఓం దామోదరాయ నమః

# సంకల్పం:

శ్రీ గోవింద! గోవింద! గోవింద! ఏవంగుణ విశేషణ విశిష్టాయాం అస్యాం శుభతిథౌ భగవద్భాగవత ఆచార్యకైంకర్య రూపేణ శ్రీ గోదా రంగనాథయోః పాణి గ్రహణ కర్మ కరిష్యే. (నీటినిస్పృశించి)

శ్రీ గోదా రంగనాథయోః పాణిగ్రహణకర్మణి కంకణ ధారణం కరిష్యే.

(రెండు దారములతో గాని, 5 దారములతో గాని రెండు కంకణములను చేసి వాటికి మామిడి ఆకును చుట్టి పసుపుతో తడిపి వాటికి షోడశోపచార పూజను చేయాలి)

ఓం కంకణ దేవాతాయై శ్రియై నమః

ధ్యాయామి. ఆవాహయామి, ఆసనం సమర్పయామి. అర్ఘ్యం సమర్పయామి. పాద్యం సమర్పయామి.

ఆచమనీయం సమర్పయామి.

స్నానం సమర్పయామి.

స్నానానంతరం శుద్ధాచమనీయం సమర్పయామి.

వస్త్రయుగ్మం సమర్పయామి.

ఊర్ధ్వపుండ్రాన్ సమర్పయామి.

దివ్యశ్రీ చందనం సమర్పయామి.

పుష్పైఃపూజయామి.

ధూపమాఘ్రాపయామి.

దీపం సందర్శయామి.

నైవేద్యం సమర్పయామి.

తాంబూలం సమర్పయామి.

మంగళనీరాజనం సమర్పయామి.

(రంగనాధునికి (కృష్ణునికి ) కుడిచేతికి, గోదాదేవి యొక్క ఎడమచేతికి ఈ కంకణములను ధరింపచేయాలి.)

శ్రీరంగనాథస్వామినఃపాదౌ ప్రక్షాళయామి.

ఆచమనీయం సమర్పయామి.

(పాదప్రక్షాళన స్వామికి చేసి, ఆచమనీయం సమర్పించాలి)

శ్రీరంగనాథస్వామినః ఉద్వాహకర్మణి యజ్ఞోపవీత ధారణం కరిష్యే.

ఓం యజ్ఞోపవీత దేవతాభ్యోనమః ధ్యాన ఆవాహనాది షోడశోపచార పూజాం కరిష్యే.

(యజ్ఞోపవీతమునకు షోడశోపచారపూజను చేయాలి.

యజ్ఞోపవీతమునకు చందనాదులర్పించి స్వామికి ఎడమ భుజంపైనుండి కుడిభుజం క్రిందకు వచ్చునట్లు ధరింపచేయాలి).

(శ్రీరంగనాథుడు తనకు కన్యకను అన్వేషించుమని బ్రహ్మణోత్తములను

పంపుచున్నట్లు భావించి నలుగురికి గాని, 8 మందికిగాని అచటనున్నపెద్దలకు తాంబూలముల నిచ్చి శ్రీగోదారంనాధుల ప్రవరలను అనుసంధించాలి).

## శ్రీ రంగనాథ ప్రవర:

పర, వ్యూహ, విభవ, అంతర్యామి, అర్చావతార
పంచార్షేయ, ప్రవరాన్విత పరబ్రహ్మ
గోత్రోద్భవాయ
ఆదినారాయణశర్మణో నప్త్రే
పర, వ్యూహ, విభవ, అంతర్యామి, అర్చావతార
పంచార్షేయ, ప్రవరాన్విత పరబ్రహ్మ
గోత్రోద్భవాయ
వైకుంఠనాథశర్మణః పౌత్రాయ
పర, వ్యూహ, విభవ, అంతర్యామి, అర్చావతార

పంచార్షేయ, ప్రవరాన్విత పరబ్రహ్మ
గోత్రోద్భవాయ వ్యూహ వాసుదేవ శర్మణః
పుత్రాయ

పర, వ్యూహ, విభవ, అంతర్యామి,
అర్చావతార పంచార్షేయ, ప్రవరాన్విత పరబ్రహ్మ
గోత్రోద్భవాయ శ్రీరంగనాథ శర్మణేవరాయ.

## శ్రీ గోదా ప్రవర:

సాలామృత, సౌపర్ణ, అమృతాహరణ త్రయార్షేయ
ప్రవరాన్విత సాలామృత గోత్రోద్భవాం
కాశ్యపశర్మణో నప్త్రీం
సాలామృత, సౌపర్ణ, అమృతాహరణ త్రయార్షేయ
ప్రవరాన్విత సాలామృత గోత్రోద్భవాం
వేదాత్మఃశర్మణఃపౌత్రీం
సాలామృత, సౌపర్ణ, అమృతాహరణ త్రయార్షేయ

ప్రవరాన్విత సాలామృత గోత్రోద్భవాం
విష్ణుచిత్త శర్మణఃపుత్రీం
సాలామృత, సౌపర్ణ, అమృతాహరణ త్రయార్షేయ
ప్రవరాన్విత సాలామృత గోత్రోద్భవాం
శ్రీగోదానామ్నీం కన్యాం వృణీధ్వం
వృణీమహే (అనిఉచ్చరించి)
శ్రీ గోదారంగనాథయోః ఉద్వాహకర్మణి
మధుపర్కం సమర్పయామి.
(పెరుగు, తేనెలను కొబ్బరి కురిడిలో కలిపి
మూడుసార్లు పెరుమాళ్ళకు సమర్పించాలి.)

## మహా సంకల్పం:

భగవతో మహాపురుషస్య శ్రీ లక్ష్మినారాయణస్య
అచింత్యా పరిమిత శక్త్యా భ్రియమాణస్య అనేక కోటి
బ్రహ్మాండానాం ఏకతమే వ్యక్తావ్యక్త మహదహంకార

పృథివ్యాపెతేజో వాయ్వాకాశాది ఆవరణైః ఆవృతేస్మిన్ మహతి బ్రహ్మాండ ఖండ యోర్మధ్యే! ఆధార శక్త్యాది అష్ట దిగ్గజోపరి ప్రతిష్ఠితే!

అతల వితల సుతల తలతలాది సప్తలోకానాం అధోభాగే!

ఐరావత పుండరీక వామనాది అష్టదిగ్దన్తి శుణ్డాదండోత్తంబితే!

ఇంద్రాగ్ని యమాదీ అష్టదిక్పాలక వరిపాలితే! అంగవంగకళింగ కాశ్మీర కాంభోజాది అనేక విశేష దేశభాషా భూమిపాలవిచిత్రితే!

అయోధ్యా మథురా మాయా కాశీ కాం చ్యాది సప్తపుణ్యపురీ విరాజితే! పంచాశత్ కోటి విస్తీర్ణ భూమండలే!

కలియుగే ప్రథమపాదే! జంబూద్వీపే భరతవర్షే భరతఖండే మేరోర్దక్షిణ దిగ్భాఘే, గంగాకావేర్యోః

మధ్యదేశే అస్మిన్వర్తమాన వ్యావహారిక చాంద్రమానేన ప్రభవాది షష్టి సంవత్సరాణాం మధ్యే..... సంవత్సరే..... అయనే .... ఋతౌ .... మాసే ...... పక్షే..... తిథౌ...... వాసరే ..... శుభనక్షత్రే, శుభయోగే, శుభకరణే, ఏవంగుణ విశేషణ విశిష్టాయాం అస్యాం శుభతిథౌ సుముహూర్తే, శుభలగ్నే, సాలంకృత సహిరణోద్యక కన్యాదాన మహం కరిష్యే.

గోదానామ్నీ మిమాం కన్యాం సర్వాభరణ శోభితాం।
దాస్యామి విష్ణవే తుభ్యం సర్వలోక హితాయవై ॥

భగవతో వరదాభయ హస్తే ప్రదాయ.

## మంగళాష్టకములు:

శ్రీ రంగే గరుడాచలే ఖగగిరౌ సింహాచలే మందిరే
వైకుంఠే కనకాచలే నిషథే నారాయణాఖ్యా చలే।
లోకాలోక మహాచలేచ నిషదే పుణ్యాచలేష్వాశ్రియః

పాయాద్వో భగవాన్ పురాణ పురుషః కుర్యాత్
సదా మంగళమ్ ॥

శ్రీ రామానుజ భట్టరార్య శఠకోపానంత సంకర్షణైః
శ్రీ సౌదర్శన పాంచజన్య భరతాచార్యైః మహావైష్ణవైః।
వేదై శ్శాస్త్ర పురాణ వైష్ణవ కథాలాపైః సదా సేవితః
పాయాద్వో భగవన్ పురాణ పురుషః కుర్యాత్
సదామంగళమ్॥

## మాంగల్యధారణ:

పూర్వోక్త ఏవంగుణ విశేషణ విశిష్టాయాం శుభతిథౌ శ్రీగోదారంగనాథయోః పాణిగ్రహణ కర్మణి మాంగల్యధారణం కరిష్యే.

(మంగళ సూత్రములను తీసుకొని అక్షతల పళ్ళెమునందు ఉంచి అర్ఘ్యపాద్యాదులు సమర్పించి పసుపు కుంకుమలతో లక్ష్మీ అష్టోత్తర శతనామావళిని

ఉచ్చరించుచూ పూజ చేయాలి)

ఓం మాంగల్య దేవతాభ్యోనమః, అర్ఘ్యాది షోడశోపచార పూజాం సమర్పయామి.

(పూజ అయిన పిమ్మట మంగళసూత్రములను తీసుకొని)

మాంగల్య తంతు నానేన లోకరక్షణ హేతునా।
కంఠే బధ్నామి సుభగే త్వం జీవ ! శరదాం శతం॥

మంగళ సూత్రములను పెరుమాళ్ళ హస్తమునకు స్పృశింపచేసి శ్రీగోదాదేవికి ధరింపచేయాలి.

విలాసము కొరకై తలంబ్రాలను ఇరువురు ఒక్కొక్కరి తరపున తీసుకొని పెరుమాళ్లకు గోదాదేవికి ధరింపచేయాలి.

పెరుమాళ్ళ యొక్క ఉత్తరీయపు అంచునందు, గోదాదేవి యొక్క కొంగు చివరియందు తాంబూ

లములుంచి ముడివేయవలెను.

**ఆరగింపు:**

పెరుమాళ్ళకు అర్ఘ్యపాద్యాదులు సమర్పించి, ఫలములు, ప్రసాదములను ఆరగింపు చేయవలెను.

**మంగళాశాసనము:**

మంగళ నీరాజనం సమర్పయామి.

లక్ష్మీచరణ లాక్షాంక సాక్షాత్ శ్రీవత్స వక్షసే।
క్షేమంకరాయసర్వేషాం శ్రీ రంగేశాయ మంగళమ్॥

స్వోచ్ఛిష్ట మాలికాబంధ గంధ బంధుర జిష్ణవే ।
విష్ణుచిత్త తనూజాయై గోదాయై నిత్యమంగళమ్ ॥

మాదృశా కించన త్రాణ బద్ధ కంకణ పాణయే ।
విష్ణుచిత్త తనూజాయై గోదాయై నిత్యమంగళమ్ ॥

శ్రీమత్యై విష్ణుచిత్తార్య మనోనందన హేతవే ।
నందనందన సుందర్యై గోదాయై నిత్య మంగళమ్ ॥

మంగళాశాసన పరైః మదాచార్య పురోగమైః ।
సర్వైశ్చ పూర్వైరాచార్యైః సత్కృతాయాస్తు మంగళమ్॥

(తీర్థ, ప్రసాద వినియోగములను చేయవలెను.)

శ్రీరంగనాయక్యై నమః

సర్వం శ్రీకృష్ణార్పణమస్తు

యనాల వెంకటరెడ్డి గారి

తల్లితండ్రులు

లక్ష్మిగోపాల్ రెడ్డిల

ఆయుష్యఆరోగ్య అభివృద్ధి కోసం

వెంకట్‌రెడ్డి గారి సమర్పణ

చిన వీరాంజనేయులు గారి

ఆర్థిక సహకారంతో...



పేరు : డా॥ కందాడై రామానుజాచార్య M.A., Ph.D.

తండ్రి : రత్నమాచార్య, తల్లి : రాధారుక్మిణి

జననం : 15-07-1944

విద్యాభ్యాసం : వేదాంత వర్ధినీ కళాశాల, సీతారాంబాగ్, హైదరాబాద్

విద్యార్హత :
- తర్క, వ్యాకరణ, సాహిత్య వేదాంత, జ్యోతిష మీమాంసాశాస్త్ర పరిచయము
- అలంకార మణిహారంపై పరిశోధనా వ్యాసమునకు స్వర్ణ పతకము

వృత్తి : ఎస్.వి.వి.వి.ఎస్. కళాశాల ప్రధానాధ్యాపకులు

రచనలు :
- శ్రీమద్భాగవతము దశమ, ఏకాదశ, ద్వాదశ స్కంధానువాదములు, అర్థ తాత్పర్యము.
- నారద పురాణము – ఆంధ్రానువాదము
- ముహూర్త చింతామణి – ఆంధ్రా వ్యాఖ్యానము
- పద్మ పురాణము – ఆంధ్రానువాదము
- సుందరకాండ, ప్రహ్లాదోపదేశము, ప్రహ్లాద స్తుతి
- సదాచార నిర్ణయము, భగవద్రామానుజులు, తిరుప్పావు
- సారము, కాలజ్ఞానము మొదలగునవి.

ఉపస్కారములు :
- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వముచే ఉత్తమోపాధ్యాయ
- ఎండోమెంటు వారిచే అగమకోవిద
- శ్రీ వైష్ణవ సేవాక్షేత్రము వారిచే వేదవిభూషణ
- ఇతర సంస్థలచే ఉపన్యాస శిరోమణి, ప్రవచన వారిధి
- జ్యోతిర్విజ్ఞాన భాస్కర
- జ్యోతిష బ్రహ్మజ్ఞాని